

కోనేరులో స్వామివారి తెప్పోత్సవం (అంతరచిత్రం) తెప్పపై వెంకయ్యస్వామి

నేత్రానందంగా తెప్పోత్సవం

- వైభవంగా ముగిసిన వెంకయ్యస్వామి ఆరాధన
- అంగరంగ వైభవంగా రథోత్సవం • కిక్కిరిసిన గొలగమూడి వీధులు
- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి దంపతులు



గొలగమూడి వీధుల్లో సాగుతున్న రథం

వెంకటాచలం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): భగవాన్ వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారికి తెప్పోత్సవాన్ని నేత్రానందంగా నిర్వహించారు. స్వామి ఆశ్రమం పక్కనే ఉన్న కోనేరులో ఏర్పాటు చేసిన తెప్పను, రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. తెప్పపై వెంకయ్య స్వామివారిని ఆశీనులను చేసి పరిమళభరిత పుష్పాలతో అలంకరించారు. కళ్లు మిరుమిట్లు గొలిపే బాణ సంచా కాంతులు, మేళతాళాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెప్పోత్సవం జరుగుతున్నంతసేపూ భక్తులు 'ఓం నారాయణ... ఆది నారాయణ'... అంటూ భజనలు చేశారు. కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు కోనేటి కట్టపై బారులు తీరారు. రాత్రికి పలు సాంస్కృతిక, నాటక ప్రదర్శనాలు నిర్వహించారు.

• వేడుకగా రథోత్సవం



స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకు వెళుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి దంపతులు

ఆదివారం ఉదయం 10 గంటలకు స్వామివారికి వైభవంగా రథోత్సవం నిర్వహించారు. తొలుత రథాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి లాగి ప్రారంభించారు. అనంతరం రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. కాగా అంతకు ముందు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జ్యోతమ్మ దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వారికి ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తదుపరి అన్నదాన సత్రంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణను సోమిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలని, ప్రజలందరికీ మంచి జరగాలని స్వామివారిని కోరినట్లు తెలిపారు. వెంకయ్యస్వామి ఆశ్రమం సర్వేపల్లి నియోజకవర్గంలో ఉండడం తన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆయన వెంట ఆలయ పాలక మండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

• కిక్కిరిసిన గొలగమూడి

ఉత్సవాల్లో చివరిరోజు గొలగమూడి భక్తులతో కిక్కిరిసింది. స్వామివారి సమాధి మందిరాన్ని దర్శించుకోవడానికి భక్తులు గంటలకొద్దీ క్యూలో నిలబడ్డారు. భక్తుల కోసం ఆశ్రమం వారు మంచినీరు, మరుగుదొడ్లు లాంటి వసతులు కల్పించారు. ఉచిత వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయం

'సంస్థాగత' సందడి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడి ఎంపికకు ప్రత్యేక కమిటీ
- సభ్యులుగా మంత్రి సత్యప్రసాద్, నాని, రాకేష్
- ఒకేసారి అనుబంధ సంఘాల నియామకం
- రేపు జిల్లా నేతలతో విస్తృతస్థాయి సమావేశం

నెల్లూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నిన్నటివరకూ నామినేటెడ్ పదవుల భర్తీతో ఖుషీఖుషీగా ఉన్న టీడీపీ కేడర్‌లో ఇప్పుడు సంస్థాగత ఎన్నికల సందడిని నెలకొంది. కీలకమైన జిల్లా కమిటీ, అనుబంధ కమిటీల నియామకానికి పార్టీ అధిష్ఠానం కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా ప్రతీ పార్లమెంటుకు ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు ఉన్నారు. నెల్లూరు పార్లమెంటు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు అనుబంధ సంఘాలకు కమిటీలను ఏర్పాటు చేసేందుకు ముగ్గురితో కమిటీ ఏర్పాటైంది. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ మంగళవారం జిల్లాకు రానుంది. నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఆ రోజున విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నది.

• పార్టీ నేతలకు ఆహ్వానం

జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు నుంచి మండల పార్టీ అధ్యక్షుల వరకూ ఈ సమావేశంలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం అందింది. ఈ సమావేశంలో ప్రధానంగా జిల్లా అధ్యక్షుడి ఎన్నికపై చర్చ సాగనున్నది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతి నిధులతోపాటు ముఖ్య నేతల నుంచి కమిటీ సభ్యులు అభిప్రాయం తీసుకోనున్నారు. అలానే 17 అనుబంధ సంఘాల నియామకాలపై కూడా కేడర్‌తో చర్చించనున్నారు. వీటికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా తీసుకోనున్నారు. ఇలా జిల్లా నుంచి అందిన ప్రతిపాదనలను క్రోడీకరించి తుది నివేదికను ఈ కమిటీ పార్టీ అధిష్ఠానానికి అందించనుంది. ఆ నివేదిక ప్రకారం పార్టీ అధిష్ఠానం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులను నియమించనుంది.

• ఐదేళ్ల తరువాత నియామకం

దాదాపు ఐదేళ్ల తర్వాత జిల్లా కమిటీ, అనుబంధ సంఘాల కమిటీలకు సంస్థాగత ఎన్నికలు జరుగుతుండడంతో అధికార పార్టీలో సందడి నెలకొంది. ప్రస్తుతమున్న కమిటీలు 2020 సెప్టెంబరులో ఎన్నికయ్యాయి. నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడిగా అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శిగా చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి కొనసాగుతున్నారు. సాధారణంగా ప్రతీ రెండేళ్లకు ఒకసారి కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తుంటారు. అయితే కరోనా విపత్కర పరిస్థితులు రావడం, ఆ తర్వాత పార్టీ సభ్యత్వ నమోదు జరగడం, ఆ వెంటనే సాధారణ ఎన్నికలు రావడంతో కొత్త కమిటీల ఏర్పాటు జరగలేదు. గత మేలో జరిగిన మహానాడులోపే జిల్లాల కమిటీలను నియమించాలని భావించారు. ఆ క్రమంలోనే మండల స్థాయి వరకూ కమిటీల ఏర్పాటును పూర్తి చేశారు. అయితే నామినేటెడ్ పదవుల భర్తీ నేపథ్యంలో జిల్లా కమిటీల ఏర్పాటులో జాప్యం జరిగింది. ఆ ప్రక్రియ ఇప్పుడు మొదలైంది. నెల లోపు కొత్త అధ్యక్షుడి నియామకంతోపాటు కొత్త అనుబంధ కమిటీలను ఏర్పాటు చేయాలని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది. కాగా ఇతర పార్లమెంట్ సెగ్మెంట్ల అధ్యక్షులు, ప్రధాన, అనుబంధ కమిటీల ఎంపికకు ఏర్పాటు చేసిన కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురి నేతలకు చోటు దక్కింది. నరసాపురం పార్లమెంటు కమిటీలో మంత్రి పొంగూరు నారాయణ, విజయవాడ పార్లమెంటు కమిటీలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటు కమిటీలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నంద్యాల పార్లమెంటు కమిటీలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కడప పార్లమెంటు కమిటీలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సభ్యులుగా ఉన్నారు.

నిధుల స్వాహాకు అడ్డుకట్ట

- ఒకటి నుంచి స్వర్ణ పంచాయతీ పోర్టల్ సేవలు
- ప్రతి రూపాయికీ లెక్క చూపాల్సిందే!
- పారదర్శకంగా నిధుల జమాఖర్చులు

గ్రామ పాలనలో కొత్త ఒరవడి



చేజర్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దీపం ఉండగానే ఇళ్లు చక్కదిద్దుకోవాలన్న ఆలోచనతో గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీల పాలన గాడి తప్పింది. కొంతమంది అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చేతివాటం ప్రదర్శించి, పంచాయతీల్లో నిధుల స్వాహాకు శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో రూ. లక్షల నిధులు దుర్వినియోగం అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇకపై పంచాయతీల్లో అవకతవకలు జరగకుండా ఉండేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే పంచాయతీలో ఖర్చు చేసే ప్రతి పైసాకు పక్కాగా లెక్కలు చూపాల్సిందేనని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో సెప్టెంబరు ఒకటి నుంచి స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను అమలులోకి తీసుకురానున్నది. ఈ పోర్టల్ ద్వారానే కార్యదర్శులు నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. గ్రామాల్లో ఆస్తి, నీటి పన్నులను వందశాతం ఆన్‌లైన్‌లో చెల్లించే విధానాన్ని అమలు చేయనున్నది. దీంతో పంచాయతీల నిధుల స్వాహాకు అడ్డుకట్ట పడనున్నది. గ్రామ పాలనలో కొత్త ఒరవడికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

• రూ.కోట్లలో నిధుల జమ

జిల్లాలో 722 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటికి 15వ ఆర్థిక సంఘం నిధులు, ఆస్తి, నీటి పన్ను, ఇతర లైసెన్స్‌లు, మైనింగ్, రిజిస్ట్రేషన్లు, సెస్‌ల రూపంలో ఏటా రూ. కోట్లలో నిధులు జమ అవుతున్నాయి. మేజర్ పంచాయతీల్లో కొందరు గ్రామకార్యదర్శులు, పాలకవర్గ సభ్యులు గతంలో చేతివాటం చూపారు. మోటార్ల మరమ్మతులకు గురి కాకున్నా అయినట్లు, వీధిదీపాలు వేయకనే వేసినట్లు, పారిశుధ్య పనులు చేపట్టకనే చేపట్టినట్లుగా చూపి రూ. లక్షల నిధులు స్వాహా చేశారు. ఏదైనా వస్తువును తక్కువ ధరకు కొనుగోలు చేసి, రికార్డుల్లో మాత్రం ఎక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు రాసిన ఉదంతాలూ ఉన్నాయి. ఆస్తి పన్ను వసూలు చేసి సొంతానికి వాడుకున్నవారు కూడా ఉన్నారు. ఈ విషయాలు బయటపడి కార్యదర్శులు సస్పెండ్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. మరికొందరు నిధులు సొంతానికి వాడుకుని ఆడిట్ తనిఖీల సమయంలో నగదు జమ చేశారు. ఇవన్నీ మండల పరిషత్ అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరించారు.

• ఒకటి నుంచి పోర్టల్‌లో నమోదు

సెప్టెంబరు (వచ్చేనెల) ఒకటి నుంచి స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఆర్థిక అంశాలపై సమగ్ర వివరాలను నమోదు చేయాలి. ఈ పోర్టల్‌లో బ్లీచింగ్, వీధి దీపాలు, శానిటరీ పరికరాలు, పారిశుధ్య పనుల బిల్లులు అప్‌లోడ్ చేయాలి. అనంతరం సీఎఫ్ఎంఎస్ ఆమోదం తెలుపుతుంది. గ్రామ పంచాయతీల్లో అస్తి పన్ను వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రజలకు ఆన్‌లైన్‌లోనే డిమాండ్ నోటీసులు జారీచేయనున్నారు. పన్ను వసూళ్లను నగదు రహితంగా చేపట్టనున్నారు.

• గతంలో లెక్కల్లేవు...

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రజల నుంచి ఎంత పన్ను వసూలు చేశారో...? బ్యాంకు ఖాతాలో ఎంత జమచేశారో... ? తదితర వివరాలు పంచాయతీ కార్యాలయాల్లో ఉండేవి కావు. అంతేకాక జిల్లాలోని కొంతమంది పంచాయతీ కార్యదర్శులు వసూలు అయిన పన్నుల మొత్తాన్ని తమ జేబులో వేసుకునేవారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం స్వర్ణ పంచాయితీ పోర్టల్‌ను ప్రవేశపెట్టి వీటన్నింటికీ చెక్ పెట్టనున్నది.



ఓనం ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న కలెక్టర్ ఆనంద్

అలరించిన ముందస్తు ఓనం వేడుకలు

ఆకట్టుకున్న రంగవల్లులు, సంప్రదాయ నృత్యాలు

వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషం : కలెక్టర్



నృత్యం చేస్తున్న మళయాళీ యువతులు



సంప్రదాయబద్ధంగా తీర్చిదిద్దిన రంగవల్లి

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మళయాళీల సంక్రాంతి అయిన ఓనం పండుగను ముందస్తుగా ఆదివారం నగరంలోని పురమందిరంలో నిర్వహించారు. ఈ వేడుకలను మళయాళీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని మళయాళీ కుటుంబాలు వారు సంప్రదాయ దుస్తులు ధరించి తరలి వచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ ఉపాధి కోసం వచ్చి జిల్లాలో స్థిరపడ్డ మళయాళీలు ప్రతీఏటా జన్మభూమి కేరళలో జరిగే ఓనం పండుగను ముందస్తుగా, క్రమం తప్పకుండా జరుపుకోవడం, తాను పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అందరికీ ఓనం శుభాకాంక్షలు అని తెలిపారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నెల్లూరులో మళయాళీలు తెలుగువారితో కలిసి పోయారని తెలిపారు. రాష్ట్రం మారినా తమ సంప్రదాయాలకు విలువ నిస్తూ ముందస్తుగా ఓనంను జరుపుకోవడమే కాక, నగరవాసులకు విందు ఇవ్వడం అభినందించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో పలువురు నగర ప్రముఖులు తదితరులు పాల్గొని ఓనం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంప్రదాయ పద్ధతిలో మహిళలు ముగ్గులు వేశారు. కేరళీయుల దుస్తులతో ఓనం పాటలకు లయబద్ధంగా నృత్యాలు చేసి, అందరినీ ఆకట్టుకున్నారు.బలి చక్రవర్తిని పూజించారు. కార్యక్రమంలో మళయాళీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు టీజీ. గోపి, కార్యదర్శి మధు, ట్రెజరర్ సిద్దోస్, చైర్మన్ మురుగన్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు నందకుమార్, ఏపీ అధ్యక్షుడు చాచాషాన్, జాన్సన్, శ్రీకుమార్ నాయర్ తదితరులు పాల్గొని అతిథులను మెమోంటోలతో సత్కరించారు. అలాగే కళాకారులకు జ్ఞాపికలు ప్రదానం చేశారు.

జిల్లాకు 7,10,990

స్మార్ట్ రేషన్ కార్డులు

- నేటి నుంచి పంపిణీ
- తొలిరోజు మంత్రులు, ఎమ్మెల్యేల అందజేత



ప్రభుత్వం రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ సోమవారం (నేటి) నుంచి ప్రారంభం కానున్నది. ఇందుకుగాను జిల్లాకు 7,10,990 స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయి. జిల్లాలోని 1,513 రేషన్ షాపుల పరిధిలో వీటి ప్రారంభం కానున్నది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయిలో మంత్రులు వీటిని పంపిణీ చేయనున్నారు. ఇందుకు తగ్గట్లు అధికారులు ఏర్పాట్లు చేశారు. కొంతమంది కొత్త కార్డుల కోసం ఎదురుచూస్తుండగా, ఇంకొందరు కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటైన తరువాత స్మార్ట్‌కార్డులను పంపిణీ చేస్తామని ప్రకటించింది. దీంతో 71,808 మంది కొత్తకార్డులు, కార్డుల్లో మార్పులు, చేర్పులు, రద్దు కోసం దరఖాస్తు చేశారు. ప్రభుత్వం వీటన్నింటినీ పరిశీలించి, ప్రకటించిన మేరకు సోమవారం నుంచి ఈ కార్డులను పంపిణీ చేయనున్నది. వీటిని తహసీల్దార్ పర్యవేక్షణలో సచివాలయ వలంటీర్లు, రేషన్ షాపు డీలర్లు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తారు. ఈనెలాఖరు వరకు ఇలా పంపిణీ చేస్తారు. అలా పంపిణీ చేయగా మిగిలిన కార్డులను సెప్టెం బరు ఒకటి నుంచి రేషన్ షాపుల్లో ఉంచుకుని డీలర్లు లబ్ధిదారులకు అందచేస్తారు. ఈ స్మార్ట్ కార్డులు ఆధునిక సాంకేతకతో రూపుదిద్దుకున్నాయి. వీటిలో బయో మెట్రిక్ డేటా, క్యూఆర్ కోడ్ వంటి ప్రత్యేకతలు ఉన్నాయి. వీటి వల్ల లబ్ధిదారులు ఎక్కడ నుంచైనా సులభంగా రేషన్ తీసుకునే అవకాశం ఉంది.

పోలీసుల అదుపులో

రౌడీషీటర్లు

- శ్రీకాంత్, అరుణ దందాలపై పోలీసుల దూకుడు
- నేడో రేపో పోలీసు కస్టడీకి కి'లేడీ'

నెల్లూరు(క్రైం) ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ శ్రీకాంత్, కి'లేడీ' అరుణ దందాలపై పోలీసులు దూకుడు పెంచారు. ఇప్పటికే అరుణ కాల్‌లిస్ట్ ఆధారంగా ఆమెతో తరచూ మాట్లాడు తున్న రౌడీషీటర్లను పోలీసులు గుర్తించారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకోగా, మరి కొంత మంది రౌడీ షీటర్లు పరారీలో ఉన్నారు. నెల్లూరు వేదాయపాలెం స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లు సీహెచ్ భూపతి, అరవ సురేంద్ర, కే జగదీష్‌ను పోలీసులు గంజాయి కేసులో అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఇప్పటికే జిల్లాలోని బాలాజీ నగర్ పోలీసు స్టేషన్‌తో పాటు పలు పోలీసు స్టేషన్లలో పలువురు రౌడీషీటర్లను అదుపు లోకి తీసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా తిరుపతి జిల్లా పరిధిలో సైతం కొంత మంది రౌడీషీటర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా కోవూరు పోలీసులు అరుణను తమ కస్టడీకి ఇవ్వాలని ఇప్పటికే కోర్టును కోరారు. ఈ క్రమంలో నేడో రేపో ఆమెను కస్టడీకి ఇవ్వనున్నారు.

• దర్గామిట్ట ఎస్ఐకి పదోన్నతి

గుంటూరు రేంజ్ పరిధిలో ఆరుగురు ఎస్ఐలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో నెల్లూరు దర్గామిట్ట ఎస్ఐ బీ రమేష్‌బాబు ఉన్నారు.

కోర్టుకెక్కిన కరేడు భూసేకరణ వ్యవహారం

- ఆలయ భూములకు నోటిఫికేషన్‌పై హైకోర్టులో రిట్
- 28న విచారణ జరిగే అవకాశం?

కందుకూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఉలవపాడు మండలం కరేడు భూసేకరణ వ్యవహారం కోర్టుకెక్కింది. ఇండోసోల్ సోలార్ కంపెనీకి భూములు ఇచ్చేందుకు తొలినుంచి విముఖత చూపుతూ వివిధరూపాల్లో రైతులు తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో భూసేకరణ నోటిఫికేషన్‌లోని లోసుగుల ఆధారంగా హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కరేడులో ఇండోసోల్ సోలార్ కంపెనీకోసం 4800 ఎకరాల భూసేకరణ కోసం కలెక్టరు జారీచేసిన నోటిఫికేషన్‌లో దేవదాయశాఖ భూములు కూడా ఉండటాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలైంది. కరేడు గ్రామానికి చెందిన వివిధ ఆలయాల భూములతోపాటు కందుకూరు జనార్దన్‌స్వామి ఆలయం, ఉలవపాడు వేణుగోపాలస్వామి ఆలయం, సింగరాయకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయాలకు కరేడు గ్రామపంచాయతీ పరిధిలో భూములు ఉన్నాయి. ఆ భూములన్నింటినీ ఇండోసోల్ కంపెనీ కోసం సేకరించే నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. అయితే దేవదాయ భూముల క్రయవిక్రయాలపై నిషేధం అమలులో ఉండటమేకాక, ప్రత్యేక పరిస్థితుల్లో ప్రజాఅవసరాలకు తీసుకోవాలంటే రాష్ట్రప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతి పొందాల్సి ఉంది. ఈ నేపథ్యంలో భూసేకరణ నోటిఫికేషన్‌లో దేవదాయ భూములు కూడా ఉండటాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించింది. దీనిపై ఈనెల 28న విచారణ నిర్వహించనున్నట్లు తెలిసింది. భూసేకరణ నోటిఫికేషన్ మొత్తం లోపభూయిష్టంగా ఉందని, ఆ నోటిఫికేషన్ రద్దుకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	105
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216

కోడిగుడ్ల ధర (100): 535

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9594
వెండి కిలో ధర	రూ. 119900
వెండి ఒక గ్రాము	రూ.123.00

వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలి : సీపీఎం

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బుజబుజ నెల్లూరులో వాటర్ ప్లాంట్‌ను వెంటనే పునరుద్ధరించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఆదివారం ఆ ప్లాంట్ వద్ద నాయకులు ఆందోళన చేపట్టారు. రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యుడు పెంచల నర్సయ్య మాట్లాడుతూ దాదాపు 20వేల మంది దాహార్తిని తీర్చే వాటర్ ప్లాంట్‌కు సకాలంలో మరమ్మతులు చేయకపోవడం వల్ల నాలుగు కోట్ల విలువ చేసే వాటర్ ప్లాంట్ తుప్పు పట్టిందన్నారు. వెంటనే ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, సోమవరపు వెంకయ్య, తిరుపాల్ పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఆర్టీసీ-1వ డిపో పరిధిలోని ప్రయాణికులకు బస్సుల్లో మెరుగైన సేవలు అందించేందుకు సోమవారం డయల్ యువర్ డీఎం కార్యాక్రమం నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి డీఎం సునీత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, 9959225641 నెంబరుకు ఫోన్ చేసి సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు.

నూర్‌బాషాల సంక్షేమానికి కృషి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : నూర్‌బాషా(దూదేకుల)ల సంక్షేమానికి కృషి చేస్తామని నూర్‌బాషా బీసీ ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కే బాబర్‌జాన్ చెప్పారు. ఆదివారం నగరంలోని ఓ సమావేశ మందిరంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. బాబర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్నీ గ్రామాల్లో పర్యటించి దూదేకుల కులస్తుల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా యువత అధ్యక్షుడు షేక్ సుభాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్, జిల్లా ఉపాధ్యక్షుడు రహమతుల్లా, కోశాధికారి షేక్ మస్తాన్, సహాయ కార్యదర్శి నాయబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు షేక్ షరీఫ్, షేక్ జహీర్ తదితరులు పాల్గొన్నారు.

● **జాషువా వీధి బోర్డు ఏర్పాటు**

నగరంలోని కూరగాయల మార్కెట్ పక్కనున్న వీధికి ప్రముఖ కవి గుర్రం జాషువా పేరుతో నామకరణం చేయడం హర్షణీయమని బాబర్ జాన్ అన్నారు. ఆదివారం ఆ వీధి బోర్డును ప్రారంభించారు. గుర్రం జాషువా గ్రంధాలయ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ ఖాసీం, టీడీపీ నాయకుడు జెన్ని రమణయ్య, బోర్డు దాత ఏవీ సుబ్బారావు పాల్గొన్నారు.

రాయల్ క్యాప్స్ మహిళా అధ్యక్షురాలిగా శైలజ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : రాయల్ క్యాప్స్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా బసిశెట్టి శైలజను, నెల్లూరు నగర అధ్యక్షురాలిగా పసుపులేటి సునీతను నియమించారు. ఈ మేరకు క్యాప్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు బోల్లా మల్లేశ్వరీ దేవి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పేద, మధ్యతరగతి బలిజ బాల బాలికలకు ఉన్నత విద్యను, ఆర్థిక చేయూతనిస్తామని ఈ సందర్భంగా శైలజ, సునీత పేర్కొన్నారు.

నేటి నుంచి ద్వారకామాయి వార్షికోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీనగర్ సాయి దర్బార్ అనుబంధ సంస్థ శ్రీసాయి మాతా నిత్య అన్నప్రసాద నిలయం ద్వారకా మయి 4వ వార్షికోత్సవం సోమ, మంగళ వారాల్లో నిర్వహిస్తున్నట్లు సాయిదర్బార్ అధ్యక్షుడు మధుసాయి తెలిపారు. ఆదివారం వార్షికోత్సవ కరపత్రాలు ఆవిష్కరించారు. సోమవారం ఉదయం సాయి నామ సంకీర్తన, మంగళవారం నృసింహ కల్యాణం జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

మెగా కార్డన్ సెర్చ్

● నగరాన్ని జల్లెడ పట్టిన పోలీసులు
● 350 మంది సిబ్బందితో తనిఖీలు
● 113 బైక్‌లు, 7 ఆటోల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాల వద్ద ఏఎస్పీ, డీఎస్పీ, సీఐలు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆరు పోలీసు స్టేషన్ల పరిధిలో ఎక్కడ చూసినా ఆదివారం తెల్లవారు జాము నుంచే పోలీసు వాహనాల సైరన్లు, పోలీసుల తనిఖీలు కనిపించాయి. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశాలతో మెగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ప్రతీ పోలీసు స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకొని జల్లెడ పట్టారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ పీ సింధుప్రియసహా పోలీసు అధికారులు, సిబ్బంది, స్పెషల్ పార్టీ వారితో కలిపి 350 మంది ఈ సెర్చ్‌లో పాల్గొన్నారు. సరైన పత్రాలు లేని 113 బైకులు, 7 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్పీ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, దొంగతనాల నివారణ, అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. కాగా, ఈ కార్డన్ సెర్చ్‌లో చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో రాజీవ్‌గృహకల్ప వద్ద, నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఉడ్ హౌస్ సంఘంలో, సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలోని కపాడిపాలెంలో, దర్గామిట్ట పోలీసు స్టేషన్ పరిధిలో సారాయి అంగడి సెంటర్ ప్రాంతంలో, వేదాయపాలెం స్టేషన్ పరిధిలోని వైఎస్ఆర్ నగర్ ప్రాంతంలో, బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో వెలగచెట్టు సంగం ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఆయా స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, వేణుగోపాల్‌రెడ్డి, దశరథరామారావు, రోశయ్య, శ్రీనివాసరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

సండే ఆన్ సైకిల్



నెల్లూరు(క్రైం), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు నగరంలోని పోలీసు కవాతు మైదానంలో ఆదివారం పోలీసు అధికారులు, సిబ్బంది సండే ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిట్‌నెస్‌కి డోస్ - ఆదా గంట రోజ్ అనే నినాదంతో స్థానిక యోగా గురువు, హెడ్‌కానిస్టేబుల్ మురళి ఆధ్వర్యంలో పోలీసులు సామూహిక యోగాసనా లు, సైక్లింగ్ చేశారు. ఎస్పీ జీ కృష్ణకాంత్ మాట్లాడుతూ ప్రతీరోజు కనీసం 30 నిమిషాలు సైకిల్ తొక్కడం వల్ల శరీరానికి అవసరమైన వ్యాయామం లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రామారావు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐ పాల్గొన్నారు.

ఆటోలో మర్చిపోయిన సూట్‌కేసు అప్పగింత

నెల్లూరు(క్రైం), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆటోలో మరిచిపోయిన సూట్కేస్‌ను సాంకేతికత ఆధారంగా పోలీసులు గుర్తించి బాధితులకు అందజేశారు. సేకరించిన సమాచారం మేరకు... ఎర్రన మహేందర్‌రెడ్డి, ప్రశాంతి అన్నా చెల్లలు. వారు తమ సొంత ఊరు బిట్రగుంటకు వెళ్లేందుకు బెంగళూరు నుంచి ఆర్టీసీ బస్సులో ఆదివారం నెల్లూరుకు వచ్చారు. ఆర్టీసీ ప్రధాన బస్టాండులో బస్సుదిగి ఆటోలో ఆత్మకూరు బస్టాండుకు వెళ్లారు. అక్కడి నుంచి బస్సులో బిట్రగుంటకు చేరుకున్నారు. ఇంటికి వెళ్లి చూడగా సూట్కేస్ కనిపించలేదు. దీంతో నెల్లూరు చిల్డ్రన్స్‌పార్కు వద్ద ఉంటున్న బంధువు మాల్యాద్రిరెడ్డికి జరిగిన విషయాన్ని చెప్పి అందులో రూ.20 వేలు నగదు, విలువైన వస్తువులు ఉన్నాయని తెలిపారు. ఆయన నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కే రామకృష్ణకు విషయాన్ని తెలియజేశారు. ఇన్‌స్పెక్టర్ ఆత్మకూరు బస్టాండు పరిసర ప్రాంతాల్లో గాలింపు జరిపారు. కంట్రోల్‌రూమ్ సిబ్బంది సహకారంతో ఆటోను గుర్తించి సూట్కేస్‌ను బాధితులకు అప్పగించారు. వారు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, కానిస్టేబుల్ పొన్ను స్వామి, కమాండ్ కంట్రోల్ సిబ్బంది హైదర్‌ఆలీకి కృతజ్ఞతలు తెలిపారు.

కలిసి పనిచేద్దాం : కోటంరెడ్డి



అశోక్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్/స్టోన్‌హౌస్‌పేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : అందరం కలిసి పనిచేద్దాం రండి అంటూ నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రూరల్లోని దేవరపాళెం సర్పంచ్, వైసీపీ నాయకుడు వేమిరెడ్డి అశోక్‌రెడ్డి ఎమ్మెల్యే సమక్షం లో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూరల్లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరు శాతం ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ప్రదీప్, శేఖర్ పాల్గొన్నారు. కాగా, నెల్లూరు ఏఎంసీ డైరెక్టర్‌గా ఎన్నికైన గునుకుల విజయలక్ష్మి ఆదివారం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని, గిరిధ ర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గునుకుల కిషోర్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

స్టేడియంలో శతమానం భవతి

నెల్లూరు(విద్య), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శతమా నంభవతి కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు నెలలో జన్మించిన వాకర్స్ సభ్యులకు కండువాల కప్పి శుభాశీస్సులు అందచేశారు.

అమీర్‌జాన్ ఆర్ట్‌కి ప్రశంసలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం ఫోరమ్ ఫర్ ఆర్ట్, కళాయజ్ఞ సంస్థలు సంయుక్తంగా శ్రమైక జీవనం చిత్రకళపై పోటీలు నిర్వహించింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన అమీర్‌జాన్ చిత్రించిన కుమ్మరి శ్రమైక జీవన చిత్రానికి ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్టు శ్రీధర్ ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 40 మంది చిత్రకారులు పాల్గొన్నారు.

దళిత విభజనతో దేశ విభజన...!

● కేంద్ర మాజీ మంత్రి చింతా



ర్యాలీలో చింతామోహన్, స్వర్ణ వెంకయ్య తదితరులు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : దళితుల విభజన దేశ విభజనకు దారితీస్తుందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. ఆదివారం నగరంలోని ఏబీఎం ప్రాంగణం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ జరిగింది. దీనిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనాలోచితంగా ఎస్సీ వర్గీకరణపై ముందుకెళుతున్నాయని ఆరోపించారు. ఉత్తర ప్రదేశ్, తమిళ నాడులో ఎస్సీ వర్గీకరణ లేదన్నారు. అలాంటప్పుడు మన రాష్ట్రంలో వర్గీకరణ ఎందుకని ప్రశ్నించారు. చంద్రబాబు చేసిన పొరపాటును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు స్వర్ణ వెంకయ్య మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాత్రమే ఎస్సీ వర్గీకరణకు పూనుకున్నారని, మిగతా రాష్ట్రాల్లో అలాంటి ప్రస్తావన లేదన్నారు. దళితులంతా కలిసి ఉండాలన్నారు. ఈ ర్యాలీలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యామల సుదర్శన్, ఎస్సీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు, రిపబ్లిక్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, హరిబాబు పాల్గొన్నారు.

గణేశ్ భక్తులకు అసౌకర్యం కలగనివ్వం

● ఎంహెచ్‌వో కనకాద్రి



గణేష్ ఘాట్ వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఎంహెచ్‌వో కనకాద్రి

నెల్లూరు(సిటీ), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వినాయక నిమజ్జన సమయంలో గణేష్ ఘాట్ వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగనివ్వమని ఎం హెచ్‌వో కనకాద్రి తెలిపా రు. ఆదివారం ఆయన నగరంలోని గణేష్ ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. పారిశుద్యానికి ప్రాదాన్యత ఇవ్వాలని అధికారులు, సిబ్బందికి సూచించారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పప్పులవీధిలో ఉన్న పాండురంగ అన్నదాన సమాజంలో ఆదివారం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ జరిగింది. కొండా ప్రవీణ్ శంకర్ చారిటబుల్ ట్రస్ట్, నుడా మాజీ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ మిత్ర మండలి సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు వినాయక ప్రతిమలు, పసుపు, కుంకుమ, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి నారాయణ విద్యా సంస్థల జీఎం, టీడీపీ నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వినాయక చవితి ఉత్సవాల్లో ప్రతీ ఒక్కరు మట్టి ప్రతిమలనే పూజించాలని పిలుపునిచ్చారు. నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు అధ్యక్షుడు శ్రీధర్, మెడికల్ అధ్యక్షుడు ప్రదీప్, కన్యకా పరమేశ్వరి దేవస్థానం మాజీ చైర్మన్ శ్రీరామ్ సురేష్, జ్యోతిప్రసాద్ పాల్గొన్నారు.

● నగరంలో గాంధీబొమ్మ సెంటర్‌లోని శ్రీవెంకటరమణ షాపి, శ్రీశ్రీ ఏజెన్సీ, ఆంధ్రప్రదేశ్ పేపర్ మర్చంట్ అసోసియేషన్ సౌజన్యంతో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, యూరాలజిస్టు డాక్టర్ మోహన్‌రాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. షాపీ అధినేత శ్రీపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బలవంతపు చందాలు నేరం

రంగనాథ్‌గౌడ్, ఎస్ఐ, కోవూరు

కోవూరు, ఆగస్టు 24, (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా బలవంతంగా చందాలు వసూలు చేస్తే నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని కోవూరు ఎస్ఐ రంగనాథ్ గౌడ్ హెచ్చరించారు. చవితి ఉత్సవాల సందర్భంగా విగ్రహాల్ని ప్రతి ష్ఠించేందుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

?. వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి తీసుకోవాల్సిందేనా

!. తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. విగ్రహాల అనుమతికి ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి.

?. డీజేలకు అనుమతి ఉందా

!. విగ్రహాల ఊరేగింపు సందర్భంగా డీజేలకు అనుమతి లేదు. డీజేల్ని ఏర్పాటు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

?. విగ్రహాలకు చందాల వసూళ్ళపై పోలీసు శాఖ నిర్ణయాలెలా ఉన్నాయి

!. విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపు కోసం బలవంతపు చందాలు వసూలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

?. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నారు

!. విగ్రహాలు ప్రతిష్ఠించిన ప్రాంతాలను పరిశీలిస్తాం. అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. దీపారాధన సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నాం. విద్యుత్తు సరఫరా, డెకరేషన్లను కూడా పరిశీలిస్తాం. రాత్రి 10 గంటల తరువాత ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదు. రికార్డింగ్ డ్యాన్సులు పూర్తిగా నిషేధించాం.

?. అసాంఘిక కార్యక్రమాలపై దృష్టి పెట్టారా

!. అసాంఘిక కార్యక్రమాలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక దృష్టి సారించాం. అసాంఘిక శక్తుల ఆట కట్టించేందుకు నివారించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

గణేశ్ మండపం.. అనుమతులు సులభం

● పోలీస్‌స్టేషన్‌కు వెళ్లక్కర్లేదు
● అందుబాటులో సింగిల్ విండో విధానం

పొదలకూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో గణేష్ ఉత్సవ్ 2025 అనుమతుల పోర్టల్ వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు అనుమతులు కావాలంటే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకునేలా కూటమి ప్రభుత్వం మార్పులు చేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసినప్పటినుంచి అనుమతులు వచ్చే వరకు రోజుల తరబడి పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. నోటరీ చేయించడంతోపాటు అనేక రకాల చలానాలు చెల్లించేవారు. పోలీసుల చేతులు తడిపితేనే గాని అనుమతి పత్రాలు అందేవి కావు. అప్పట్లో అధికార పార్టీ నేతల మనసెరిగి.. పోలీసులు పక్షపాత ధోరణిలో ఇతరులకు అనుమతులి వ్వకుండా ఇబ్బంది పెట్టిన సందర్భాలున్నాయి. ఇలాంటి వాటికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టి పారదర్శక విధానంలో అనుమతుల జారీ విధా నం తీసుకొచ్చింది.

● **దరఖాస్తు ఇలా...**

గణేష్ ఉత్సవ్ డాట్ నెట్ వెబ్‌సైట్ తెరిచి అందులో నూతన దరఖాస్తును క్లిక్ చేయాలి. ఫోన్ నెంబరు నమోదు చేయగానే ఓటీపీ వస్తుంది. అది నమోదు చేశాక దరఖాస్తు పత్రం వస్తుంది. అందులో దరఖాస్తుదారుడి పేరు, ఫోన్ నెంబరు, ఈమెయిల్, చిరునామా నమోదు చేయాలి. విగ్రహం ఏర్పాటు చేస్తున్న స్థలం, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, పోలీస్ సబ్‌డివిజన్, పోలీస్‌స్టేషన్ పేరు, ఉత్సవ కమిటీ సభ్యులు పేర్లు, వారి ఫోన్ నెంబర్లు, విగ్రహాన్ని నిమజ్జనం చేసే తేదీ, సమయం, ఏ వాహనంలో తరలిస్తారో వివరాలు నమోదు చేసి ఎంటర్ నొక్కాలి. తరువాత దరఖాస్తు దారుడికి గుర్తింపు సంఖ్య వస్తుంది. పోలీసులు క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలిస్తారు. ఆ తర్వాత ఆన్‌లైన్‌లోనే అనుమతులొస్తాయి. దరఖాస్తుదా రుడి ఫోన్‌కి అనుమతి పత్రం (ఎన్‌వోసీ) క్యూఆర్ కోడ్ రూపంలో వస్తుంది. అది ప్రింట్ తీసి సంబంధిత మండపాల వద్ద ప్రదర్శించాలి.

● **సులువుగా చేయొచ్చు..**

చవితి ఉత్సవాలకు పోలీసులు అనుమతి తప్పనిసరి. దరఖాస్తు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన సింగిల్ విండో విధానంలో సులువుగా దరఖాస్తు చేయవచ్చు.

హనీఫ్, ఎస్ఐ, పొదలకూరు.

ఈ దఫా ముందుగానే హంగామా...

మనుబోలు : ఈ ఏడాది యువత గణేశ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు యువకులు ఉత్సాహం చూపుతున్నారు. ముందస్తుగానే మండపాలు సిద్ధం చేయడం, వాటికి పూల అలంకరణలు, విద్యుద్దీపాలు సెట్టింగులు, వర్షం వస్తే మండపాలు పాడవకుండా పట్టలు కప్పడం ఇలాంటి పనులను చురుగ్గా చేస్తున్నారు. ఈ హంగామాతో గ్రామాల్లో ముందుగానే వినాయక చవితి పండుగ వాతావరణం కనిపిస్తోంది. మరో పక్క బొజ్జ గణపయ్యల ప్రతిమలు తెచ్చే విషయంలోనూ యువత తగ్గేదే లే.. అంటోంది. మిగతా బొమ్మల కంటే తమ బొమ్మే ఎత్తుగా, గంభీరంగా, భిన్నంగా ఉండాలన్న ఉత్సుకతతో ఉన్నారు. నెల్లూరు, గూడూరు మొదలైన పట్టణాలకు వెళ్ళి అధిక ధరలకు వెనుకాడకుండా వేలాది రూపాయలు ఖర్చు పెట్టి మరీ తీసుకువస్తున్నారు. చతుర్థి ముందు రోజు మంగళవారం రావడంతో దానిని సెంటిమెంట్‌గా భావించి అది, సోమ వారాల్లోనే దుకాణాల నుంచి మండపాలకు బొమ్మలను చేర్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏదీ ఏమైనా ఈ ఏడాది వినాయక చతుర్థి సందడి మూడు రోజుల ముందునుంచే కనిపిస్తోంది.



మనుబోలులోని ఓ గణేశ్ మండపం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

ఊరూరా వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వెంకయ్యస్వామి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గొలగ మూడి వెంకయ్య స్వామి ఆరాధనో త్సవాలను పురస్క రించుకుని ఆదివారం బుచ్చి నగర పంచాయతీతో పాటు మండలంలోని వాడ వాడలా ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. బుచ్చి నగర పంచాయతీలోని రాఘవ రెడ్డి కాలనీ, శాంతినగర్, జొన్న వాడ, పంచేడు, రెడ్డి పాళెం (బట్టిపాటిదిన్నె), రేబాల పంచాయతీలోని లక్ష్మీపురం గ్రామాలలో వెంకయ్య స్వామి మందిరాలలో స్వామికి ఉద యం అభిషేకం, ప్రత్యేక పూజ లు నిర్వహించారు. వెంకయ్య స్వామిపై భక్తులు ఆలపించిన భజన పాటలు అలరించాయి. మందిరాలలో స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు పెద్ద ఎత్తున ప్రత్యేక అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలు మందిరాలలో మంగళ వాద్యాల నడుమ పల్లకిసేవలు, గ్రామోత్స వాలు నిర్వహించారు. ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● రాపూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అఖిల పూర్ణాశ్రమం వార్షి కోత్సవ ఆరాధనా మహోత్సవాలు ఆది వారం ఘనంగా నిర్వహించారు. నిర్వా హకురాలు నిర్వయాంబ గౌరమ్మ ఆధ్వ ర్యంలో ఉదయం వెంకయ్య స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, భజన, అన్నవితరణ అన్నవితరణ కార్య క్రమా లు జరిగాయి. ఆశ్రమ అధ్యక్షు రాలు సింగంశెట్టి గౌరమ్మ, కార్యదర్శి విజయ మ్మ, కోశాధికారి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వతమ ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా భయన చిరంజీవి మహాత్మా గాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహానికి గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల పట్టువస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం విద్యార్థులకు మహాత్మాగాంధీ జీవిత విశేషాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, విద్యా ర్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యోగా మాస్టార్ రాజేంద్రకు బంగారు పతకాలు



బంగారు పతకాలు అందుకుంటున్న రాజేంద్రకుమార్

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్తిపాడు లోని సరస్వతి విద్యాలయంలో జరి గిన 6వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాం పియన్‌షిప్ - 2025 పోటీలలో బుచ్చిరెడ్డిపాళెం యోగా మాస్టర్ రాజేంద్ర కుమార్‌ను రెండు బంగారు పతకాలు వరించాయి. ఈ పోటీలలో సీనియర్ సి విభాగంలో టెస్టింగ్ బాడీ ఇండివిజ్యువల్ యోగ ఈవెంట్లో ఒక బంగారు పతకం, లెగ్ బ్యాలెన్స్ ఇండివిజ్యువల్ యోగ ఈవెంట్లో మరో బంగారు పతకం సాధించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజ రైన తెలంగాణ, ఏపీ యోగాసన భారత జాతీయ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నందనం కృపాకర్, స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ రాధిక చేతుల మీదుగా ఆయన పతకాలను అందుకున్నారు. విజయవాడలో జరగబోయే జాతీయ స్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ 2025 పోటీలకు రాజేంద్ర అర్హత సాధించారు.

తెలుగుభాషపై చర్చ జరగాలి : విఠపు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : తెలుగుభాషపై గట్టి చర్చ జరగాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఆదివారం నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జెట్టి శేషారెడ్డి భవన్‌లో అమ్మభాషకు వందనం కార్యక్రమం జరిగింది. ఆయన ప్రధాన వక్తగా ప్రసంగించారు. తెలుగు భాష అభివృద్ధికి ప్రభుత్వం కంటి తుడుపు చర్యలు చేపడుతోందని విమర్శించారు. వరికుంటపాడులో మనస్సు ఫౌండేషన్ వారు తెలుగు పుస్తకాన్ని డిజిటలైజ్ చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ తూమాటి సంజీవరావు రచించిన విశిష్ట తెలుగు దిగ్దర్శనం పుస్తకావిష్కరణ జరిగింది. న్యాయవాది నాగరాజారావు, డాక్టర్ కరుణశ్రీ, డాక్టర్ పాతూరి అన్నపూర్ణ, నెరసం అధ్యక్షుడు జయప్రకాష్, బాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా ఫుట్‌బాల్ విజేత అనంత

• నెల్లూరుకు తృతీయ స్థానం • ముగిసిన రాష్ట్ర పోటీలు



ఫుట్‌బాల్ పోటీల విజేతలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఏపీ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ టోర్నీలో అనంతపురం జట్టు విజయం సాధించింది. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులు జరిగిన ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. కడప ద్వితీయ స్థానం, నెల్లూరు తృతీయ స్థానం దక్కించుకున్నాయి. బహుమతి ప్రదానోత్సవానికి మాజీ రంజీ క్రీడాకారుడు, జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి హాజరై మాట్లాడారు. క్రీడాకారులకు క్రమశిక్షణతో కూడిన శిక్షణ అవసరం అన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారిణులు జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి రాష్ట్రానికి కీర్తి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు ఆనంద్, శిరీష్, చలపతి, ప్రభాకర్, కుమారస్వామి, ప్రవీణ్ కుమార్, రవి, సురేష్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బీ చంద్రశేఖర్, కోచ్‌లు పాండురంగారావు, సాయి పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌తో ఉజ్వల భవిత

• రాష్ట్ర అధ్యక్షుడు ద్వారకానాథ్
• ముగిసిన అండర్-15 పోటీలు



విజేతలతో రాష్ట్ర, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు

నెల్లూరు(విద్య), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : బ్యాడ్మింటన్ క్రీడకు విశేష ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో యువత ఆ క్రీడలో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. నగరంలో ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఇండోర్ స్టేడియంలో యూనెక్స్-సన్‌రైజ్ ఏపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-15 రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే మెరుగైన అవకాశాలు అందిపుచ్చుకోవచ్చన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, జిల్లా అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎం ప్రసాద్‌రావు, కోశాధికారి గాదంశెట్టి శ్రీకాంత్, చౌదరి జ్యువెలర్స్ ఎండీ రాకేష్ చౌదరి, కోచ్‌లు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజేతలు వీరే....

రాష్ట్రస్థాయి అండర్-15 సబ్‌జూనియర్ బాల, బాలికల బ్యాడ్మింటన్ పోటీల్లో బాలుర సింగిల్స్ విభాగంలో పి.రోషన్(గుంటూరు), విజయ్‌చంద్ర(పశ్చిమగోదావరి), బాలికల విభాగంలో డి.వి.యజ్ఞశ్రీ(అనంతపురం), త్రిషదీప్తి(తూర్పుగోదావరి) విజేతలుగా నిలిచారు. అలాగే డబుల్స్ బాలుర విభాగంలో భార్గవ్-చాద్విక్(విశాఖ), మానస్ అల్లు(తూర్పుగోదావరి)-జి.షణ్ముక్‌వర్ధన్(ప్రకాశం)లు, బాలికల విభాగంలో డి.విజయతేజస్విని (విశాఖ)-త్రిషదీప్తి(తూర్పుగోదావరి), జి.సుష్మరెడ్డి(నెల్లూరు)-డి.వి. యజ్ఞశ్రీ(అనంతపురం)లు విజయం సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో మానస్ అల్లు-త్రిషదీప్తి(తూర్పుగోదావరి)-డి.వి.యజ్ఞదత్-డి.వి.యజ్ఞశ్రీ(అనంతపురం)లు విజయం సాధించారు.

ఈ మోటార్ సైకిల్ కథేంటి..?



ఆంజనేయస్వామి గుడి ముందు వదిలి వెళ్లిన మోటార్ సైకిల్

మనుబోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో కనిపిస్తున్న మోటార్ సైకిల్ వారం రోజులుగా మనుబోలులోని ఆంజనేయస్వామి దేవస్థానం ముందు ఉంది. వెనుక నంబర్ ప్లేటు లేదు. ముందు సగం నంబర్ మాత్రమే ఏ 26 ఏజడ్ అని మాత్రమే కనిపిస్తుంది. మోటార్ సైకిల్‌పై ఓ తాళంతో కూడిన చైన్ పెట్టి గుర్తుతెలియని వ్యక్తులు వదిలేసి వెళ్ళినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో మనుబోలులో మోటార్‌సైకిళ్ల చోరీలు ఎక్కువయ్యాయి. గత నెలలో రామమందిరం వద్ద ఓ వ్యక్తి మోటార్ సైకిల్ ఎక్కడిదో తెచ్చి వదిలేసి వెళ్ళిపోయాడు. అదే రోజున దళితవాడలో ఓ మోటార్ సైకిల్ చోరీ జరిగింది. వారం రోజుల కిందట మనుబోలులో ఓ ముస్లిం యువకుడు మోటార్‌సైకిల్ తీసుకెళ్ళి కేఆర్ పురంలో వదిలి అక్కడ మరో మోటార్‌సైకిల్‌తో దొంగలు ఉడాయించారు. బయట గ్రామాల మోటార్ సైకిళ్లు ఇక్కడకు తీసుకురావడం, ఇక్కడ మోటార్ సైకిళ్ళు తీసుకెళ్ళడం దొంగలకు వెన్నతో పెట్టిన విద్య. దీనిపై పోలీసులు నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. గ్రామం అంతా సీసీ కెమెరాలు ఉన్నాయి. సాంకేతికత ఆధారంగా మోటార్‌సైకిళ్ళ దొంగలను పోలీసులు పట్టుకోలేరా? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహేష్ బాబు



మహేష్‌బాబుకు నియామక పత్రాన్ని అందచేస్తున్న కృష్ణయ్య

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా చేజర్ల మహేష్‌బాబు నియమితులయ్యారు. సంఘం జాతీయ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు ఆర్ కృష్ణయ్య హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో ఆదివారం మహేష్ బాబుకు నియామక పత్రం అందచేశారు. కార్యక్ర మంలో సంఘం మహిళా విభాగం జాతీ య ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల పద్మజా యాదవ్, టీడీపీ నాయకుడు అన్నంగి రమణయ్య, మహిళా అధ్యక్షురాలు రజని, జిల్లా ప్రధాన కార్యదర్శి సుష్మా, ఉడతా శైలజ, విజయమ్మ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య కేసులో
యువకుడి అరెస్టు

ఉదయగిరి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.చెర్లోపల్లి పంచాయతీ వడ్డిపాళెం గ్రామానికి చెందిన బత్తల శివప్రియ పురుగుమందు సేవించి ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన కేసులో వల్లెపు హరికృష్ణ అనే యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఆదివారం తెలిపారు. వివరాల మేరకు.. శివప్రియ ప్రేమ వ్యవహారంలో మేనెల 29న పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగుమందు సేవించి ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందిందన్నారు. యువతి మృతికి అదే గ్రామానికి చెందిన హరికృష్ణ కారణమని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. విచారణలో శివప్రియ మృతికి హరికృష్ణ కారణమని నిర్ధారణ కావడంతో అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

కత్తితో బెదిరించి నగదు దోపిడీ

నెల్లూరు(క్రైం): బావను కత్తితో చంపుతానని బెదిరించి నగదు దోచేసిన బావమరిదిపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని జ్యోతినగర్‌కు చెందిన సందానీ టింకరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన బావమరిది సాజిద్ మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ నెల 23న సందానిని మద్యం తాగేందుకు నగదు ఇవ్వాలని సాజిద్ కోరాడు. ఆయన లేవని చెప్పడంతో చంపుతామని బెదిరించి రూ.1000 నగదు దోచుకెళ్లాడు. బాధితుడు శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎందరో అంధులు...
నేత్రదాతలే దిక్కు!

• ప్రజలు మూఢనమ్మకాలు విడనాడాలి
• నేత్రదానానికి ముందుకు రావాలి
• స్వచ్ఛంద సంస్థల కృషి ప్రశంసనీయం
• నేటి నుంచి సెప్టెంబరు 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలు

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అవయవ దానాల్లో నేత్రాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. దాతలు ఇచ్చే నేత్రాల వల్లే ఎందరికో చూపు వస్తుంది. మరణానంతరం నేత్రదానం చేస్తున్న వారు తాము చనిపోయినా, తమ కళ్ల ద్వారా ప్రకృతిని చూస్తున్నామన్న భావన కలుగుతుంది. దేశవ్యాప్తంగా 12 లక్షల మంది అంధులు ఉండగా, ఏటా మరో 1.25 లక్షలమంది చేరుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. అయితే కేవలం 20శాతం మాత్రమే నేత్రాలు దానం చేస్తుండడంతో సమస్య తీవ్రతరం అవుతోంది. మూఢనమ్మకాలు సైతం నేత్రదానానికి అవరోధంగా మారాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు 25 (నేటి)నుంచి సెప్టెంబరు 8 వరకు జాతీయ స్థాయిలో ప్రభుత్వం నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నది. నేత్రదానంపై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేలా ప్రభుత్వం కృషిచేస్తున్నది. అలాగే పలు స్వచ్ఛంద సంస్థలు కూడా ఎంతగానే కృషి చేస్తున్నాయి. ప్రస్తుతం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లో ఉన్న ఎల్‌వీ ప్రసాద్ కంటి నిధికి పంపుతున్నది.

• జిల్లాలో ఎందరో దాతలు

జిల్లాలో ఇప్పటివరకు 2,632 మంది దాతలు 5,264 నేత్రా లను దానం చేశారు. అలాగే ఎంతోమంది నేత్ర దానానికి తమవంతు చేయూత ఇస్తా మని ప్రతిజ్ఞ చేశారు. ఇప్పటికే లక్షమందికిపైగా తమ మరణానంతరం నేత్ర దానం చేస్తా మని రాతపూర్వకంగా తెలియజేసిఉన్నారు. అయితే ఈ సంఖ్య మరింత పెరగాల్సిన అవసరం ఉంది. కంటిపై గాయాలు, ఇన్‌ఫెక్షన్, పౌష్టికాహార లోపం వల్ల నల్లగుడ్డు మసకబారి కంటి చూపు గణనీయంగా తగ్గిపోతోంది. ఆఖరికి చూపు కోల్పోతారు. వీరికి తప్పని సరిగా నల్లగుడ్డు మార్పిడి చేయాల్సి ఉంది. ఇలాంటి వారికి నేత్రదానం ద్వారా మళ్లీ వెలుగును ప్రసాదించే అవకాశం ఉంది.



మాజీ ఎమ్మెల్సీ వితపు బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యుల నుంచి నేత్రాల సేకరణ(ఫైల్)



నేత్రదానంపై విస్తృత ప్రచారం చేస్తున్న వైద్యులు(ఫైల్)

• స్వచ్ఛంద సంస్థల కృషి

నేత్రాల సేకరణకు ఎన్నో స్వచ్ఛంద సం స్థలు కృషి చేస్తున్నాయి. నగరంలోని వాసవీ సేవాదళ్, చిరంజీవి యువత, వాసవీక్లబ్, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, జేసీసీ క్లబ్, బీ పాజిటివ్ సుబ్బారావు సంస్థలతో పాటు కోవూరుకు చెందిన సుభాష్ సేవా సంస్థ, విడవలూరుకు చెందిన మనసేలా సంస్థలు నేత్రాల సేకరణలో పాలుపంచుకుంటున్నాయి. నెల్లూరుకి చెందిన మాడరన్ ఆసుపత్రి నేత్రాల సేకరణలో స్వచ్ఛంద సంస్థలకు సహకారం అందిస్తున్నది. అలాగే జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్రాలను సేకరిస్తున్నది.

• ప్రజలకు అవగాహన దిశగా..

ఈనెల 25 (నేటి) నుంచి జిల్లావ్యాప్తంగా నేత్రదానంపై ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ తరపున జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఈ కార్యక్రమాలను చేపడుతు న్నది. జిల్లాలోని పలు ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, పలు విద్యాసంస్థలలో నేత్రదాన ఉద్యమ స్ఫూర్తిని నింపేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. 15 రోజుల పాటు ఈ చైతన్య కార్యక్రమాలు కొనసాగుతాయి.

ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నాం..



ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలను చేపడుతున్నాం. దాతలను ప్రోత్సహిస్తున్నాం. నేత్ర దాన మోటివేటర్లను పెంచేలా ప్రభుత్వం కృషి చేస్తున్నది. ప్రస్తుతం నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రత్యేకంగా విద్యార్థుల్లో చైతన్యం తీసుకు వచ్చేలా కృషి చేస్తున్నాం. ఎంతోమంది నేత్రదాతల కుటుంబ సభ్యులు తమను సంప్రదించి నేత్రాలు దానం చేసేందుకు హామీ ఇస్తున్నారు.

- డాక్టర్ శార్వాణి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ మేనేజర్

జిల్లా వ్యాప్తంగా సేకరించిన నేత్రాలు

సంవత్సరం	సేకరించిన నేత్రాలు
2022-23	392
2023-24	233
2024-25	241
2025- 26	124

(ఇప్పటి వరకు)

గేదెను ఢీకొన్న బైక్... వ్యక్తికి తీవ్ర గాయాలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న నారాయణరెడ్డి

ఉదయగిరి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి-దాసరిపల్లి గ్రామాల మధ్యలో 167- బీజీ జాతీయ రహదారిపై గేదెను ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. దుత్తలూరు మండలం సోమలరేగడ గ్రామానికి చెందిన నారాయణరెడ్డి పని నిమిత్తం మోటార్‌బైక్‌పై ఉదయగిరికి వచ్చాడు. అనంతరం స్వగ్రామానికి వెళుతుండగా విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపాన ఉన్న మలుపు వద్ద రోడ్డుపై ఉన్న గేదెను ఢీకొట్టడంతో అతను కిందపడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. గమనించిన వాహనదారులు 108 వాహనానికి సమాచారం అందించడంతో వారు చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు తరలించారు. ఈ ప్రమాదంలో గేదె మృతిచెందింది. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ అల శీను పరిశీలించి వివరాలు సేకరించారు.

అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

• గృహనిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్

ఉదయగిరి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ టీ వేణుగోపాల్ హెచ్చరించారు. ఈనెల 20వ తేదీన దుత్తలూరు గృహ నిర్మాణ శాఖ గోదాము నుంచి స్టీల్ (ఇనుప చువ్వ) అక్రమ తరలింపుపై పోలీసు కేసు నమోదు కావడం, ఆ శాఖ ఉదయగిరి మండల ఏఈ రామకృష్ణ తానే తరలించానని అధికారులు, పోలీసుల ముందు ఒప్పుకొన్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ఆయన ఆదివారం దుత్తలూరు గృహ నిర్మాణ శాఖ గోదామును అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గోదాములో 55.820 టన్నుల స్టీల్ నిల్వ ఉండాలన్నారు. కాగా, గోదాములో 50.618 టన్నులు, పోలీస్‌స్టేషన్‌లో ఉన్న 900 కేజీలతో కలిపి మొత్తం 51.518 టన్నులు నిల్వ తేలిందన్నారు. మిగిలిన 4.302 టన్నుల స్టీల్ వ్యత్యాసం వస్తోంద న్నారు. ఈ స్టీల్ ఎలా మాయమైందో విచారణలో తేలాల్సి ఉందన్నారు. స్టీల్ అక్రమ తరలింపునకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. కాగా, జిల్లాకు 97,445 పక్కాగృహాలు మంజూరు కాగా ఇప్పటివరకు 39,824 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే అదనపు సాయాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చేఏడాది మార్చి చివరి నాటికి గృహ నిర్మాణాలు పూర్తిచేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పేజ్-3లో నిర్మించిన ఇళ్లు సైతం పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం ఉదయగిరి మండలం కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి గ్రామంలో లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ పీరాన్, ఏఈ యప్రాయం, వర్క్ ఇన్‌స్పెక్టర్లు హర్షవర్ధన్‌రెడ్డి, పోలయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గోదాముల ఉన్న స్టీల్‌ను పరిశీలిస్తున్న పీడీ వేణుగోపాల్

సోమశిలకు 19,347 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి ఆదివారం 19,347 క్యూసెక్కులు వస్తుండగా 56.430 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 340, కండలేరుకు 9,700, డెల్టాకు 1,850 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రూరల్ డీఎస్పీ కార్యాలయానికి కాకాణి

నెల్లూరు(క్రైం), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి వచ్చారు. అక్రమ మైనింగ్ కేసులో కాకాణికి హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విషయం విదితమే. ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు కేసు విచారణ అధికారి ఎదుట హాజరు కావాలని సూచించడంతో విచారణ అధికారిగా ఉన్న రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఎదుట హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేసులు కోర్టు పరిధిలో ఉన్న దృష్ట్యా తానేమీ మాట్లాడలేనని చెప్పారు.

వెంకటాచలంలో 10 కిలోల గంజాయి పట్టివేత



ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితులు

వెంకటాచలం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్ అధికారులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. తిరుపతికి వెళ్తున్న ఓ వాహ నంలో రూ.80 వేల విలువ చేసే 10 కిలోల గంజాయిని స్వాధీ నం చేసుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఒరిస్సాలోని కోరాపూర్ వద్ద కొనుగోలు చేసి తిరుపతిలో అమ్మేందుకు తీసుకుని వెళ్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి నెల్లూరు - 2 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. తనిఖీల్లో ఎక్సైజ్ అధికారులు పీ అనిత, సీహెచ్ పూర్ణకుమార్, సిబ్బంది ఏ శ్రీనివాసులు, ఎం కిరణ్ సింగ్, టీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రైస్‌కార్డులపై అవగాహన

ఉదయగిరి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆదివారం మండలంలోని చౌకదుకాణాల డీలర్లు, సచివాలయ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రైస్‌కార్డులపై తహసీల్దారు ఎల్ రామ్మోహన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 10,674 రేషన్‌కార్డులుండగా ప్రభుత్వం 10,382 స్మార్ట్ రైస్‌కార్డులను పంపిణీ చేసిందన్నారు. ఈ కార్డులను సోమవారం నుంచి డీలర్లు, సచివాలయ సిబ్బంది కలిసి ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు అందచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు షాజియా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు రామ్మోహన్

పంటలకు మద్దతు ధర కల్పించాలి

• ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం డిమాండ్



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం నాయకులు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముత్యాల గురునాథం, తుళ్లూరు గోపాల్ మాట్లాడారు. జిల్లాలో 3,50,000 ఎకరాలకు నీళ్లు ఇస్తామని ఈ సీజన్‌కు ముందు ప్రభుత్వం ప్రకటించిందని, దీంతో రైతులు కష్టపడి 10 లక్షల పుట్ల ధాన్యాన్ని పండించారన్నారు. అయితే ఆ ధాన్యాన్ని ఎలా అమ్ముకోవాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పొట్టేపాళెం చంద్రమౌళి మాట్లాడుతూ రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఈ నెల 29న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కాలువలో దూకి వృద్ధుడి ఆత్మహత్య



వృద్ధుడి మృతదేహాన్ని గట్టుకు తీసుకువస్తున్న పోలీసులు

సంగం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పెన్నానది సంగం ఆనకట్ట సమీపంలో పాత కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువ హెడ్‌రెగ్యులేటర్ల వద్ద నీటిలో దూకి ఓ వృద్ధుడు ఆదివారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందు కున్న ఎస్‌ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే వృద్ధుడు మృతి చెంది నీటిలో తేలాడుతున్నాడు. రెగ్యులేటర్ వాకింగ్ ట్రాక్‌పై వృద్ధుడి బ్యాగు, చెప్పులు పెట్టి నీటిలో దూకినట్లు స్థానికులు తెలిపారు. దీంతో పోలీసులు బ్యాగ్‌లో పరిశీలిం చగా స్విచ్ఛాప్ అయిన కార్బన్ కీఫోన్, ఆధార్‌కార్డు ఉంది. కార్డు ఆధారంగా వృద్ధుడి పేరు పెదివీడు జయరామయ్య (61)గా గుర్తించారు. అడ్రస్సు ముదిగేడు, కలిచేడు పంచాయతీ, పొదలకూరు మండలంగా ఉంది. దీంతో పోలీసులు ఆ గ్రామస్థులకు ఫోన్‌చేయగా మృతుడి స్వగ్రామం రాయచోటు అని, గత కొంతకాలంగా ముదిగేడులో ఉంటున్నట్లు తెలిపారు. భార్య కరోనా సమయంలో మృతి చెందినని, అప్పటి నుంచి అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి వెళ్లేవాడని, మృతుడికి బంధువులెవరూ లేరని గ్రామస్థులు తెలిపారు. దీంతో పోలీసులు కేసు నమోదుచేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	105
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216

కోడిగుడ్ల ధర (100): 535

బంగారం, వెండి ధరలు
బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9594
వెండి కిలో ధర	రూ. 119900
వెండి ఒక గ్రాము	రూ.123.00

పోలేరమ్మకు పొంగళ్లు

బిట్రగుంట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరు పంచాయతీ పేటలో వెలసి ఉన్న పోలేరమ్మ తిరునాళ్లలో భాగంగా అమ్మవారికి ఆదివారం పొంగళ్ల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం ప్రత్యేక పూజాభిషేకాల అనంతరం సద్ది కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం అమ్మవారికి గ్రామ పొంగళ్ల నైవేద్యంగా సమర్పించారు.

న్యూస్ బాక్స్

డీఎస్సీలో జిల్లాస్థాయిలో 31వ ర్యాంకు


దండు అరుణ

లింగసముద్రం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో లింగసముద్రంకు చెందిన దండు అరుణ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 88.1 మార్కులతో 31వ ర్యాంకు సాధించింది. దీంతో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయిని పోస్టుకు ఎంపికైంది. తండ్రి బాల హజరత్‌రెడ్డి బేల్దారి మేస్త్రీగా, తల్లి బుజ్జమ్మ వ్యవసాయ కూలీ పనులు చేస్తూ తన ఇద్దరు కుమార్తెలను చదివించారు. అయితే టీటీసీ చదివిన అరుణ 2018లో డీఎస్సీలో 0.4 మార్కుల తేడాలో ఉపాధ్యాయిని పోస్టు కోల్పోయింది. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ తాను 2018 డీఎస్సీ తర్వాత 7 ఏళ్ల పాటు కష్టపడి చదివి ఈ పోస్టుకు ఎంపికైనట్టు చెప్పారు. చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయిని కావాలన్నది తన ఆశయమని చెప్పారు. చిన్న పిల్లల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి వారిని అభివృద్ధి చేయాలనేది తన లక్ష్యమని ఆమె తెలిపారు.

అనివేటి మండపం నిర్మాణానికి రూ.50వేల విరాళం


అనివేటి మండపం నిర్మాణానికి విరాళం అందజేస్తున్న భక్తులు

కందుకూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ అనివేటి మండపం నిర్మాణం కోసం ఆదివారం భక్తులు రూ.50వేలు విరాళంగా అందజేశారు. గతంలో కందుకూరులో పంచాయతీ రాజ్ డీఈఈగా పనిచేసి గుంటూరులో నివాసం ఉంటున్న పొత్తూరి శ్రీనివాసరావు, వెంకటగౌరీప్రసన్నలు రూ. 25వేలు, వారి కుమార్తె, అల్లుడు కనకదుర్గ సాయిసింధూర, కోసూరి వెంకటసత్యరాహుల్ దంపతులు రూ. 25వేలు విరాళంగా అందజేశారు. తన మిత్రుడు మంచిరాజు వెంకటమురళీమోహన్ ద్వారా ఆలయ కమిటీసభ్యులు కొడాలి కోటేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లులకు ఈ మొత్తాన్ని అందజేశారు.

నేరాలు, ఘోరాలకు కేరాఫ్ వైసీపీ!

● ప్రతాప్‌కుమార్ రెడ్డి నేరచరిత్ర తెలిసే హత్యాయత్నం కేసు ● బీజేపీ నేత భరత్‌కుమార్


మాట్లాడుతున్న భరత్‌కుమార్

కావలి(టౌన్), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నేరాలు, ఘోరాలకు రూట్ మ్యాప్ వేసింది వైసీపీనే అని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం 1వ పట్టణ బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవినీతి అక్రమాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రైవేట్ ఆస్తులపై అనుమతులు లేకుండా డ్రోన్లు ఎగురవేయడం తప్పు కాదని చెప్పడం సిగ్గుచేటన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అవినీతి అక్రమాలు, దందాలు, దోపిడీలకు పాల్పడలేదా, ఆయన ఇంటిముందు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నది వాస్తవం కాదా, దళితుడు కరుణాకర్ ఆత్మహత్యకు కారణం, మరో ఇద్దరు దళిత యువకులను చిత్రహింసలకు గురిచేసింది ఆయన కాదా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే నేర చరిత్ర తెలిసే ఎమ్మెల్యే కృష్ణారెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడ్డారని కేసు నమోదు చేశారన్నారు. మీడియాను రెండుగా చీల్చింది, ఫైలాన్‌ను కూల్చివేసింది ఎవరని ప్రశ్నించారు. కేసులకు భయపడను, అరెస్ట్ చేసుకోండి జైలుకు పోతాను అని ప్రగల్భాలు పలికారని, హత్యాయత్నం కేసు నమోదవ్వగానే కనిపించకుండా పారిపోయాడనారు. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు, మంద కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


బాబురావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కావలి(టౌన్), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1978-79 పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక కృష్ణం రాజేశ్వరమ్మ కల్యాణ మండపంలో కలుసుకున్నారు. ఒక రినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆలింగ నం చేసుకుని ఆనందడోలికల్లో తేలియాడారు. కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పాలక మండలి సభ్యులుగా ఎంపికైన విశ్రాంత ఆర్పీఎఫ్ ఎస్ఐ పసుపులేటి బాబురావు, విశ్రాంత ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ నారాయణలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి సేవ చేసుకునే భాగ్యం కలగడం పూర్వజన్మ సుకృతమని, ఆలయ అభివృద్ధికి తమవంతు సహకరిస్తామన్నారు. ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మధ్యాహ్నం పూర్వ విద్యార్థులు రామాయపట్నం బీచ్‌కు తరలివెళ్లి ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో నల్లూరు రమేష్, షాహుల్ హమీద్, స్వాములు, జనార్దన్, కాటా వెంకటరమణారెడ్డి, శివారెడ్డి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం


బాధితురాలికి నగదు అందిస్తున్న బెస్ట్ వాకర్స్ సభ్యులు

కావలి(టౌన్), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కచ్చేరిమిట్టకు చెందిన బహర్నిశ అనే మహిళ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా ఆమె వైద్యఖర్చులకై ఆదివారం బెస్ట్ వాకర్స్ రూ.10,000 ఆర్థిక సాయమందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు తోట శేషయ్య మాట్లాడుతూ సభ్యుల సహకారంతో మహిళ వైద్య ఖర్చులకు వితరణ చేశామన్నారు. కార్యక్రమంలో బెస్ట్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి మంద వెంకటేశ్వర్లు, భాస్కర్‌నాయుడు, గోపాల్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, వెంకయ్య, గౌస్‌బాషా, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ.. వృథాగా పోతున్న నీరు!

● దిగువ గ్రామాలకు నిలిచిన తాగునీటి సరఫరా ● పట్టించుకోని అధికారులు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు


మంగళపాలెం వెళ్లే దారిలో పైపులైన్ లీకేజీ ద్వారా వృథాగా పోతున్న నీరు

వలేటివారిపాలెం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెంలో పలు ప్రాంతాల్లో పైపులైన్ లీకేజీల ద్వారా రాళ్లపాడు-రోళ్లపాడు తాగునీరు వృథాగా పోతోంది. జెండాచెట్టు వీధిలో గుండ్రాజు విజయ్ కుమార్ ఇంటి ముందు, మంగళపాలెంనకు వెళ్లే రోడ్డు పక్కన, బీసీ కాలనీ సమీపంలో ప్రధాన రహదారి పక్కన కుంభాల శ్రీనివాసులు టిఫిన్ హోటల్ ముందు పైపులైన్ లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. గత 20 రోజులుగా తాగునీరు వృథాగా పోతుండడంతో దిగువనున్న పోలినేనిపాలెం, రోళ్లపాడు, ఉప్పలపాడు గ్రామాలకు తాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా కావడంలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బదులు పడుతున్నారు. అయినప్పటికీ పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేసి తాగునీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం లైన్‌వర్క్ ఉన్నందున ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. పామూరు రోడ్డు ఫీడర్ పరిధిలోని గాయత్రీనగర్, కొత్తకుమ్మరిపాలెం, ప్రశాంతినగర్, సింహాద్రినగర్, ఎర్రవడ్డిపాలెం, పామూరుబస్టాండ్ ఏరియా, వెంకటేశ్వర నగర్‌లకు, కోవూరురోడ్డు ఉప్పుచెరువు ఫీడర్ పరిధిలోని జనార్ధనకాలనీ, దుర్గమ్మ టెంపుల్ ఏరియా, ఉప్పుచెరువు, ఏకలవ్యనగర్, బృందావనం, మాయాబజారు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలుస్తుందని వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ నేత కందుకూరికి సత్కారం


కందుకూరిని సత్కరిస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు

కావలి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రెండోవసారి ఎంపికైన కందుకూరి వెంకటసత్య నారాయణను వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం దేవస్థానం ప్రాంగణంలో ఘనంగా సత్కరించి అభినందించారు. ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షుడు కావడం, ఆలయ పునర్నిర్మాణంలో చేయూతను అందజేయడంతో ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రంధి రమేష్, బచ్చు వీరాస్వామి, అమరావేదగిరి సుబ్బరాయుడి గుప్త, చీదెళ్ల రామచంద్రరావు, నల్లూరు రోశయ్య, చక్కా వెంకటసత్యనారాయణ, అనుమలశెట్టి శివ, గాదంశెట్టి వేణుగోపాల్, తదతరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం పోరాడుదాం

బిట్రగుంట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం పోరాడుదామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరు మాల్యాద్రి అన్నారు. బోగోలు సీపీఎం కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం 5వ మహాసభ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పాల యానాదయ్య, తుమ్మల వెంకయ్య పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా డమ్ము భాస్కర్, కార్యదర్శిగా తుమ్మల వెంకయ్య, తదితరులను ఎన్నుకున్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

బిట్రగుంట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలోని వాకర్స్ సభ్యులు, క్రైస్ట్‌జ్యోతి విద్యార్థులకు పాలకుర్తి గురవయ్య దంపతులు ఆదివారం పౌష్టికాహారం అందచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ నేత కుట్టుబోయిన బ్రహ్మానందం పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నేతలు బీ.బర్నాడ్, అశోక్, ఎం.శ్రీనివాసులు, స్వర్ణన్‌రాజు, కే.శ్రీనివాసులు, జీవన్‌కుమార్, బీజేపీ నేత ఎన్ఎస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల సమస్య అధిగమించేందుకు కృషి

● షేక్ అబ్దుల్‌రహీం, మండల వ్యవసాయాధికారి, కందుకూరు

కందుకూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎరువుల కొరతను ముఖ్యంగా యూరియా కొరతను అధిగమించేందుకు కృషి చేస్తున్నాం. నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించటం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్‌రహీం తెలిపారు.

? తీవ్రంగా ఉన్న యూరియా కొరత సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! మండలంలో యూరియాకు ప్రత్నామ్నాయంగా నానో యూరియా (లిక్విడ్)పై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇది తక్కువ శ్రమతో అధిక ఫలితం ఇస్తుంది. సాధారణ యూరియా కూడా 80 టన్నుల వరకు నిల్వలు ఉన్నాయి.

? ప్రస్తుతం కురిసిన వర్షాలతో ఏ పంటలు సాగుకు అనుకూలం. అవసరమైన విత్తనాలు సిద్ధంగా ఉన్నాయా.

! ప్రస్తుతం వర్షాధారంగా మినుము, కంది, పెసర పైర్ల సాగుకు ఎంతో అనుకూలం. కంది విత్తనాలు ఇప్పటికే రైతులకు పంపిణీ చేశాం. అలాగే రైతులు కోరితే మినుము, పెసర విత్తనాలు కూడా పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

? ఆర్ఎస్‌కేలలో ఎరువులు నిల్వలు ఎందుకు పెట్టించడం లేదు.

! ప్రస్తుతానికి వ్యవసాయ సీజన్ పూర్తిస్థాయిలో ప్రారంభంకాలేదు. రైతులు ఇండెంట్లు ఇస్తే ఉన్నతాధికారులకు తెలియజేసి ఆర్ఎస్‌కేలకు ఎరువులు తెప్పించే ప్రయత్నం చేస్తాం.

? వ్యవసాయ యాంత్రీకరణ పథకం పరిస్థితి ఏమిటి.

! ఈ పథకానికి ప్రస్తుతానికి బడ్జెట్ విడుదల కాలేదు. 80శాతం రాయితీతో డ్రోన్లు కూడా ఇస్తాం.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


శ్రీకృష్ణుడిని ఊరేగిస్తున్న భక్తులు

ఆత్మకూరు, ఆగస్టు 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని బట్టేపాడు గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక పొదలకూరు, బట్టేపాడు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం ముగిశాయి. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి బట్టేపాడు, పొదలకూరు ఉత్సవ కమిటీ నిర్వాహకులు టి నర్సారెడ్డి, జి పెంచలనరసయ్య, డి వెంకటేశ్వర్లు, పెంచలరెడ్డి, ప్రసాద్, కార్తీక్, భక్తులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు


నాగారపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, ఆగస్టు 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్నానది జలాలు, క్షీర, సకల ద్రవ్య, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా అంకాళమ్మ తిరుణాళ్ల



అనంతసాగరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంటలో ఉన్న గ్రామదేవత అంకాళమ్మ తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

మాజీ సర్పంచి శ్రీనివాసులు మృతి పార్టీకి తీరనిలోటు

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్


శ్రీనివాసులు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, ఆగస్టు 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గంగులవారి చెరువుపల్లి మాజీ సర్పంచ్ కప్పా శ్రీనివాసులు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం శ్రీనివాసులు గుండెపోటుతో మృతిచెందడంతో సమాచారం అందుకున్న ఆయన ఆదివారం టీడీపీ నాయకులతో కలిసి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనివాసులు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటసామయ్య, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహ, ఏడుకొండలు, ఆగర సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

ఘనంగా భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం


ఆత్మకూరు: వెంకయ్యస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


చేజర్ల : వెంకయ్యస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేపూరు గ్రామంలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. అనంతరం వెంకయ్యస్వామిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా వెంకయ్యస్వామి ఆశ్రమంలో తన్నీరు సీతా రత్నమ్మ జ్ఞాపకార్థం ఆమె కుటుంబసభ్యులు నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను గ్రామ నాయకుడు భాస్కర్ నాయుడు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొల్లా ఆదిశేషయ్యనాయుడు, పెంచలయ్యనాయుడు, తూమాటి శేషయ్యనాయుడు, తిరుతినాయుడు, దొడ్ల సుమన్, గ్రామ సర్పంచ్ రావిళ్ల వెంకటేశ్వర్లు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

●**సంగం:** స్థానిక కొత్తూరులో ఉన్న వెంకయ్యస్వామి ఆలయంలో ఆదివారం ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

●**చేజర్ల:** మండలంలోని పుల్లనీళ్ళపల్లి గ్రామంలో ఆదివారం భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్మి లక్ష్మయ్యనాయుడి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాలలో చేజర్ల, ఆత్మకూరు, కలువాయి, పొదలకూరు మండలాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా మండలంలోని గాలిపాళెం గ్రామంలో వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా మట్టి, గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు : సీఐ


ఎక్స్‌కవేటర్ యజమానులకు సూచనలిస్తున్న సీఐ వెంకటరావు

ఉదయగిరి, ఆగస్టు 24 (ఆంధ్ర జ్యోతి): ఉదయగిరి సర్కిల్ పరిధిలో ఎవరైనా అనుమతుల్లేకుండా మట్టి, గ్రావెల్ తరలిస్తే వాహనాలు సీజ్ చేయడంతోపాటు శాఖాపరమైన చర్యలు తప్పవని సీఐ ఎన్ వెంకటరావు హెచ్చరించారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరణలో సీతారామపురం, వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు మండలాలకు చెందిన ఎక్స్‌కవేటర్ల యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారుల వద్ద గ్రావెల్, మట్టి తరలించేందుకు అనుమతులు తీసుకోవాలన్నారు. అనంతరం పోలీసులకు సైతం ఆ అనుమతి పత్రాల నకళ్లు అందజేయాలన్నారు. అనుమతులు పొందినా రాత్రి సమయాల్లో గ్రావెల్, మట్టి తరలించరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిం చిన వారిపై కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాలను సైతం సీజ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, అల శ్రీను, పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలు జరుపుకోవాలి

ప్రశాంత వాతావణంలో వినాయకచవితి ఉత్సవాలను జరుపుకోవాలని ఉదయగిరి సీఐ ఎన్ వెంకటరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లో ఉత్సవాలు నిర్వహించే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. విగ్రహం ఏర్పాటు, నిమజ్జనం చేసే ప్రాంతాలు, నిమజ్జనానికి తరలించే తేదీ, కమిటీ సభ్యుల వివరాలను పోలీసులకు తెలియజేయాలన్నారు. ఉత్సవాల సందర్భంగా డీజేలు, పాట కచ్చేరీలకు ఎలాంటి అనుమతుల్లేవన్నారు. విగ్రహాల వద్ద విద్యుత్ ఏర్పాటు, మైక్‌సెట్ నిర్వహణకు అనుమతులు తీసుకోవడంతోపాటు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులంతా హాజరు కావాలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గోపిశ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో ఇటీవల కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణకు అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకపోవడంతో అన్ని శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రజలు సైతం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జేవీవీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


మోటివేటర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

అనంతసాగరం, ఆగస్టు 24 (ఆంధ్ర జ్యోతి): స్థానిక వ్యవసాయ సొసైటీ కార్యాలయం ఆవరణలో ఆదివారం రెడ్‌క్రాస్ వారి సౌజన్యంతో జేవివి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 48 యూనిట్ల రక్తం సేకరించారు. అనంతరం మోటివేటర్లకు నిర్వాహకులు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్, పెంచలయ్య, నియాజ్, అస్లాం, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు సత్కారం

సంగం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్‌ను ఆదివారం పడమటిపాళెం నీటిసంఘం ఉపాధ్యక్షుడు మర్రి సందీప్ శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో తరుణవాయి టీడీపీ నాయకులు డేగా రామచంద్రయ్య, మర్రి ప్రసాద్, డేగా శ్రీనివాసులు, ప్రేమ్ చంద్, మొలతాటి శ్రీనివాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

ఉదయగిరి, ఆగస్టు 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గండిపాళెం మార్గంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆదివారం తల్లిదండ్రులు కోరారు. గతంలో ఉదయగిరి-గండిపాళెంకు ఉదయం 8.30 గంటలకు బస్సు ఉండేదన్నారు. ఆ బస్సులో సున్నంవారిచింతల, గుడినరవ, దుంపవారిపల్లి, జీ.కొండారెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామాలకు చెందిన సుమారు 55 మంది విద్యార్థులు వెంగళరావునగర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లేవారన్నారు. అలాగే ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులకు ఆ బస్సు ఎంతో అనువుగా ఉండేదన్నారు. అయితే అధికారులు ఈనెల 15 నుంచి ఆ బస్సును రద్దు చేయడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సును పునరుద్ధరించాలని, లేదంటే ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలిపారు.

కుప్పం చేరిన కృష్ణమ్మ



జనసంద్రంగా మారిన గుండిశెట్టిపల్లె హంద్రీ-నీవా కాలువ గట్టు

శాంతిపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక ఎట్టకేలకు తీరింది. కృష్ణమ్మ జలాలు బిరబిరా పరుగులు పెడుతూ వచ్చేశాయి. శనివారం రాత్రి రామకుప్పం మండలం కొంగాటం గ్రామానికి చేరుకున్న జలాలు.. ఆదివారం ఉదయానికి శాంతిపురం మండలం మఠం పంచాయతీలోకి ప్రవహించాయి. ఈ సందర్భంగా రైతులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి, సంబరాలు చేసుకున్నారు. కొందరు జంతు బలులిచ్చారు. గుండిశెట్టిపల్లె వద్ద ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పీఎంకే ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్‌బాబు జలహారతి ఇచ్చారు. గత ప్రభుత్వంలో జగన్.. సినిమా సెట్ వేసి కృష్ణా జలాలను కుప్పానికి ఇస్తున్నామని జగన్నాటకం ఆడారని గుర్తుచేశారు. ఇక ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కుప్పానికి కృష్ణమ్మను తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదన్నారు. సోమవారానికంతా పరమసముద్రం చెరువుకు కృష్ణా జలాలు చేరుతాయన్నారు. 30వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు.. పరమసముద్రం చెరువు సమీపంలో జలహారతి ఇస్తారన్నారు.

పెద్దిరెడ్డి పాపాలే వెంటాడుతున్నాయ్



పుంగనూరు నియోజకవర్గంలో వందలాది టీడీపీ కార్యకర్తల కుటుంబాల కన్నీటికి కారణం పెద్దిరెడ్డి కుటుంబం. గతంలో చంద్రబాబుపై దాడి చేశారు. అక్రమ కేసులతో నాతో సహా ఎన్నో కుటుంబాలు 60 రోజులు అజ్ఞాతవాసంలో ఉన్నాయి. వందలాది కుటుంబాలను బెంగళూరు, పుదుచ్చేరి, తమిళనాడుకు తరిమేసినప్పుడు.. ఆయా కుంటుబాల్లోని కార్యకర్తల్లో నెలకొన్న బాధలు గుర్తుకు రాలేదా? ఇప్పుడు మిథున్‌రెడ్డి జైల్లో ఉంటే బాధపడడం ఏంటి? గత ఐదేళ్లలో పెద్దిరెడ్డి చేసిన పాపాలు అన్నీ ఇన్నీ కావు. అవే ఆయన్ను వెంటాడుతున్నాయి. ఇప్పటికైనా మారతాడనుకుంటే.. మారలేదు. క్రీడల్లో అవినీతికి పాల్పడిన వారెవరైనా, రోజా అయినా సరే జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందే.

- తిరుపతిలో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను ప్రారంభించాక మీడియాతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఫిట్ ఇండియా.. ఫైట్ ఒబేసిటి



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కాలి. ఎక్సర్‌సైజ్ చేయాలి. 'ఫిట్ ఇండియా.. ఫైట్ ఒబేసిటి' నినాదాన్ని పోలీసులు అందిపుచ్చుకొని ఆదివారం తిరుపతిలో సైకిల్ ర్యాలీ చేపట్టారు. 'సన్‌డే విత్ సైకిల్' కార్యక్రమంలో భాగంగా పూర్ణకుంభం సర్కిల్ నుంచి నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వరకు సైకిల్ తొక్కారు. సమయ పాలన లేకుండా ఆహారం తీసుకోవడంతో పోలీసుల్లో ఎక్కువ మంది ఒబేసిటీతో బాధపడుతున్నారని అదనపు ఎస్పీ రవి మనోహరాచ్చారి ఆందోళన వ్యక్తం చేశారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు భక్తవత్సలం, శ్రీలత, చంద్రశేఖర్, సీఐలు ప్రకాష్, చిన్నగోవిందు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

తిరుపతిలో 'సుందరకాండ'

వినాయక చవితి సందర్భంగా బుధవారం విడుదల కానున్న 'సుందరకాండ' సినిమా ప్రమోషన్స్ కోసం హీరో నారా రోహిత్, హీరోయిన్ వీర్తి, నిర్మాత సంతోష్ ఆదివారం తిరుపతికి వచ్చారు. అన్ని వర్గాలను ఆకట్టుకునేలా ఈ సినిమా తీర్చిదిద్దామని రోహిత్ అన్నారు. కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని, ప్రతి హామీనీ సీఎం చంద్రబాబు నెరవేరుస్తున్నారని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి





2న అమ్మవారి ఆలయ శుద్ధి

తిరుచానూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో సెప్టెంబరు 5 నుంచి మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఈ క్రమంలో 2వ తేదీన ఆలయశుద్ధి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఊంజల్ సేవను టీటీడీ రద్దు చేసింది. ఇక, 4వ తేది సాయంత్రం పవిత్రోత్సవాలకు అంకురార్పణ నిర్వహించనున్నారు. 5న పవిత్ర ప్రతిష్ఠ, 6న పవిత్ర సమర్పణ, 7న మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి.

ట్రాన్స్‌పాండర్

ఆపదవేళ మత్స్యకారులకు భరోసా



- త్వరలోనే మరబోట్లకు అమర్చనున్న మత్స్యశాఖ అధికారులు

బతకుదెరువుకోసం వేటకెళ్లి.. ఒక్కోసారి నడిసంద్రంలో చిక్కుకుని.. దారీ తెన్నూ కానరాక ప్రాణాలపై ఆశలు వదులుకునే మత్స్యకారులకు భరోసాగా నిలవనుంది 'ట్రాన్స్‌పాండర్'. శాటిలైట్ ఆధారంగా పనిచేసే ఈ పరికరాలను ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద కేంద్రం రాష్ట్రాలకు ఇవ్వనుంది. జిల్లాలోని మరబోట్లకు వీటిని ఉచితంగా అమర్చేలా మత్స్యశాఖ చర్యలు చేపట్టింది.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

మత్స్యకారులు అప్పుడప్పుడు అనుకోని ఇబ్బందుల్లో పడుతుంటారు. గమ్యం చేరడానికి ఆందోళన చెందుతుంటారు. అలాంటి వారి భద్రతను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ట్రాన్స్‌పాండర్ పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. వైర్‌లెస్ టెక్నాలజీతో రూపొందించిన ఈ ట్రాన్స్‌పాండర్ శాటిలైట్ టెక్నాలజీ ఆధారంగా పనిచేస్తుంది. దీని ద్వారా సమాచారం ఇచ్చిపుచ్చుకోవచ్చు. సముద్రంలో ఎక్కడున్నా పనిచేస్తుంది. సోలారు ద్వారానూ సేవలందిస్తుంది. దీనిని జిల్లాలోని 1,030 ఓబీఎం బోట్లకు అమర్చేలా మత్స్యశాఖ చర్యలు చేపట్టింది. ఈ పరికరంతో షిప్పింగ్ హార్బర్‌లోని మత్స్యశాఖ అధికారులు, కోస్టుగార్డు, నేవీ అధికారులతో అనుసంధానం చేస్తారు. ఆ బోటు ఎంత దూరం వేటకు వెళ్లింది. ఏ హార్బర్‌కు దగ్గరగా ఉందనే సమాచారం మత్స్యశాఖలో రిజిస్టర్ అవుతుంది. తద్వారా ఆ బోటుకు ఏదైనా ప్రమాదం సంభవించినట్లు తెలిసినా, అది ఎక్కడుందో తెలియడం వల్ల వెంటనే కోస్టుగార్డులను పంపి రక్షణ చర్యలు చేపడతారు. ఇక, నబీ మిత్ర యాప్‌లోనూ దీనిని నిక్షిప్తం చేస్తారు. ఇందులో జీపీఎస్ అనుసంధానం అయి ఉంటుంది. నడిసంద్రంలో బోటు దెబ్బతిన్నా, మెడికల్ ఎమర్జెన్సీ, అగ్నిప్రమాదాలు సంభవించినా బజర్ నొక్కితే కోసుగార్డులను అప్రమత్తం చేస్తుంది. ఒకవేళ బోటు దేశ సరిహద్దు దాటినా సంబంధిత అధికారులకు తెలిసిపోతుంది. వెంటనే వారిని అప్రమత్తం చేయొచ్చు. తుఫాన్ సమయాల్లోనూ ఇది ఎంతో ఉపయోగపడుతుంది. వీటిని త్వరలోనే మత్స్యకారులకు అందించి, బోట్లకు అమర్చనున్నట్లు జిల్లామత్స్యశాఖ అధికారి రాజేష్ తెలిపారు.

తీరప్రాంతం :	75 కిలోమీటర్లు
తీర మండలాలు :	తడ, సూళ్లూరుపేట, కోట, వాకాడు, చిల్లకూరు
మత్స్యకార గ్రామాలు:	42
మత్స్యకారులు :	20 వేల మంది
వేటసాగించేవారు:	3,947మంది
వేటకు వెళ్లే బోట్లు:	1,030

మత్స్యకారులకు దిక్సూచిగా ట్రాన్స్‌పాండర్లు



జిల్లాలోని మరబోట్లకు వైర్‌లెస్ టెక్నాలజీ ట్రాన్స్‌పాండర్లను త్వరలో అమర్చుతాం. ఇవి మత్స్యకారులకు దిక్సూచిగా పనిచేస్తాయి. ఏడాది క్రితం కొంతమంది జాలర్లు నడిసముద్రంలో చిక్కుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి అతికష్టంమీద బోటుతో పాటు జాలర్లను రక్షించగలిగాం. ట్రాన్స్‌పాండర్ల వ్యవస్థ అందుబాటులో ఉండి ఉంటే సులభంగా రక్షించగలిగేవాళ్లం.

- వెంకటేశ్వర్, కలెక్టర్

స్పోర్ట్స్ సిటీగా తిరుపతి

30 ఎకరాల కేటాయింపు

'అమరావతి ఛాంపియన్‌షిప్' క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి



క్రీడాజ్యోతితో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, సినీనటుడు రోహిత్, శాప్ చైర్మన్ రవినాయుడు తదితరులు



మహిళల కబడ్డీ పోటీలు



హాకీ



బాస్కెట్ బాల్



వాలీబాల్

తిరుపతి/తిరుపతి (క్రీడలు), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిని స్పోర్ట్స్ సిటీగా మారుస్తాం. ఇప్పటికే స్పోర్ట్స్ సెంటర్‌కోసం దామినేడు దగ్గర 30 ఎకరాలు కేటాయించాం అని రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం 'అమరావతి ఛాంపియన్‌షిప్' రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను మంత్రి ప్రారంభించారు. డీఎస్సీలో అర్హత సాధించిన 18వేల మందిలో దాదాపు 450 మందికి క్రీడా కోటల్లో టీచర్ ఉద్యోగాలు దక్కాయని గుర్తుచేశారు. ఎక్కడా రాజీపడకుండా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. తన తండ్రి (రామ్మూర్తి నాయుడు) ఆలిండియా కబడ్డీ చైర్మన్‌గా చేశారని, పెదనాన్న (చంద్రబాబు) స్పోర్ట్స్‌కు పెద్దపీట వేస్తుంటారని సినీ నటుడు నారా రోహిత్ అన్నారు. ఇక్కడి క్రీడాకారులు దేశానికి పతకాలు తీసుకొచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గతంలో స్పోర్ట్స్ డే అంటే ర్యాలీ చేసి, ఒకరిద్దరి ఆటగాళ్లకు సన్మానాలు చేసి ముగించేవారని శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. ఈసారి మంత్రి చొరవతో అమరావతి చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీలకు దాదాపు 1,300 మంది క్రీడాకారులు వచ్చారని శాప్ ఎండీ గిరీషా అన్నారు. అమరావతి చాంపియన్‌షిప్‌ను రెగ్యులర్ ఈవెంట్‌గా మార్చేందుకు శాప్ తీర్మానం చేసిందన్నారు. గ్రామీణ క్రీడాకారులను వెలికితీయాలనే లక్ష్యంతో ఇలాంటి ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, హస్తకళ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, క్రీడాకారిణి రజిని, డీఎస్‌సీవో శశిధర్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నాయకులు చల్లా బాబు, బీఎల్ సంజయ్, మహేష్ యాదవ్, మన్నెం శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పరుగు పందెం

పోటా పోటీగా.. : మంత్రితో పాటు పలువురు అతిథులు డమ్మీ గన్‌పేల్చి అథ్లెటిక్స్‌ను ప్రారంభించారు. వివిధ వేదికలలో ఏర్పాటుచేసిన క్రీడలు సాయంత్రం వరకు కొనసాగాయి. ఎస్వీయూ మైదానంలో అథ్లెటిక్స్, ఖోఖో.. ఎస్వీయూ క్యాంపస్ గ్రౌండ్‌లో బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్.. ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ క్యాంపస్ స్కూల్ గ్రౌండ్‌లో వాలీబాల్, ఆర్చరీ.. శ్రీనివాస క్రీడా సముదాయంలో కబడ్డీ, బ్యాడ్మింటన్.. ఎస్వీఆర్స్ కాలేజీ మైదానంలో హాకీ పోటీలు జరిగాయి. ఎస్వీయూ ప్రాంతమంతా క్రీడాకారులతో కళకళలాడింది.

కోడిపందేలా స్థావరాలపై దాడి

- 30 ద్విచక్ర వాహనాలు, 11 కోడిపుంజులు, 12 కోడి కత్తులు స్వాధీనం



కోడికత్తులు




పరుగులు పెడుతున్న పందెంరాయుళ్లు

ఏర్పేడు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం చిందేపల్లి, రాజులకండ్రిగ, మద్దిలేడు తదితర గ్రామాల్లో భారీస్థాయిలో కోడిపందేలు జరుగుతున్నాయి. పోలీసులకు అందిన సమాచారం మేరకు చిందేపల్లిలో జరుగుతున్న కోడిపందేల స్థావరాలపై ఆదివారం సాయంత్రం దాడి చేశారు. 30 ద్విచక్ర వాహనాలు, 29 మొబైల్ ఫోన్లు, 11 కోడిపుంజులను, 12 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. కోడిపందెం ఆడుతున్న 25 మందిని అదుపులోకి తీసుకుని, రూ.61,116ను స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్రవాహనాలను ట్రాక్టర్లలో ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు, కోడిపుంజులు

ఏనుగుల దాడిలో వరి పైరు ధ్వంసం



భాకరాపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం ఎగువూరు పంచాయతీ బుగ్గలవారిపల్లెకు చెందిన రైతు రెడ్డప్పతో పాటు మరికొందరికి చెందిన వరి పైరును శనివారం రాత్రి ఏనుగులు ధ్వంసం చేశాయి. అనంతరం సమీపంలోని మడిచేనువంక అటవీ ప్రాంతంలోకి వెళ్లాయని అటవీశాఖాధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి పూజారివాండ్లపల్లె, పాలమాకులపల్లె, పాళెం గ్రామాలవైపు వచ్చే అవకాశం ఉందని, రైతులెవరూ ఒంటరిగా రాత్రి పూట వెళ్లరాదని సూచించారు. తెల్లని దుస్తులు ధరించి అటవీ ప్రాంతంలో తిరగరాదని హెచ్చరించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

మౌలిక వసతుల మెరుగుకు చర్యలు తీసుకోండి



తెలుగు మహిళా నేత మట్టం శ్రావణికి సమస్యలు వివరిస్తున్న స్థానికులు

గూడూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో గల రామలింగయ్య కాలనీలోని జగనన్న లేఅవుట్‌లో మౌలిక వసతుల మెరుగుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. ఆదివారం రామలింగయ్య కాలనీ వాసులు తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణికి వినతిపత్రం అందజేసి తమ సమస్యలను వివరించారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు సక్రమంగా లేకపోవడంతో అవస్థలు పడుతున్నామన్నారు. వర్షాకాలం రోడ్డు బురదమయంగా మారడంతో ఇబ్బందులు తప్పడంలేదన్నారు. మట్టం శ్రావణి మాట్లాడుతూ కాలనీ వాసుల సమస్యలను ఎమ్మెల్యే సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లి వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తామన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ శేఖర్‌బాబు

గూడూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు, రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్లల్లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని గొడవలకు దిగడం వంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు.

ఓబీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి



రాజ్యాంగపరిక్షణ యాత్రలో చింతా మోహన్, నాయకులు

గూడూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దేశ జనాభాలో 50 శాతం ఉన్న ఓబీసీలకు రాజకీయ రిజర్వేన్లు కల్పించాలని మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. ఆదివారం ఎస్సీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ఆయన మాట్లాడుతూ దళిత విభజన దురదృష్టకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న ఈ నిర్ణయం దేశానికే మంచిదికాదన్నారు. ప్రైవేట్ రంగంలో ఎస్సీలకు రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అనంతరం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అశోక్‌బాబు, చెన్నకేశవులు, సుదర్శన్, శ్రీనివాసరావు, ప్రతాప్, చిట్టిబాబు, హరి, ప్రశాంత్, కోటేశ్వరరావు, వేణు, రమణయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



సర్టిఫికెట్లు అందుకున్న రక్తదాతలు

గూడూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ నిర్వాహకురాలు వాణి అన్నారు. ఆదివారం విశ్వబంధుత్వ దినోత్సవం సందర్భంగా స్థానిక బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారిని ఆదుకోవచ్చునన్నారు. విశ్వబంధుత్వ దినోత్సవం సందర్భంగా దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆరికట్ల మస్తాన్ నాయుడు, లోకేశ్, రఘునాథరెడ్డి, గురునాథం, రామచంద్రయ్య, శ్రీనివాసులు రెడ్డి, శైలజ, రత్నమ్మ, లత తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాససత్రం సముద్రతీరంలో డ్రోన్ వ్యూ



శ్రీనివాససత్రం బీచ్‌లో డ్రోన్ వ్యూ నిర్వహిస్తున్న ఎస్ఐ, పోలీసులు

కోట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కోట మండలం శ్రీనివాససత్రం సముద్ర తీరంలో ఆదివారం పోలీసులు డ్రోన్ వ్యూ నిర్వహించారు. ఇక్కడ బీచ్‌లో ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లాలోని పలు మండలాల నుంచి వినాయక విగ్రహాలను తీసుకొచ్చి నిమజ్జనం చేస్తారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు ఎస్ఐ పవన్ ఆధ్వర్యంలో పోలీసులు శ్రీనివాససత్రం బీచ్, ఐల్యాండ్, కృష్ణపట్నం పోర్టుకు వెళ్లే సముద్ర మార్గ ప్రాంతాల్లో డ్రోన్‌తో వ్యూ నిర్వహించారు.

శ్రీవారి సేవలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

తిరుమల, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడా పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. కమిటీ సభ్యులు దర్శన్‌సింగ్, హెమాంగ్ జోషి కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక ఆదివారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో మూలవిరాట్టును దర్శించుకున్నారు.



ఆలయం ఎదుట పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు

రెండు బైక్‌ల ఢీ: యువకుడి మృతి

పెళ్లకూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు గ్రామం వద్ద రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు... చిల్లకూరు వడ్డిపాలెం గ్రామానికి చెందిన చెమర్తి కృష్ణయ్య(30) బైక్‌పై నాయుడుపేటకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. చిల్లకూరు అండర్‌పాస్ సమీపంలో ఎదురుగా మరో బైక్‌లో వస్తున్న చీరా రోశయ్య ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కృష్ణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. రోశయ్య తలకు తీవ్ర గాయలయ్యాయి. సమాచారం అందుకున్న రైటర్ తిరుపతయ్య ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు కృష్ణయ్యకు భార్య మోహనమ్మ, కుమార్తెలు చంద్రలేఖ, ప్రవీణ, కుమారుడు శ్రీనాథ్ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





కృష్ణయ్య(ఫైల్‌ఫొటో), గాయపడిన రోశయ్య



డంపింగ్ యార్డులో చెత్తను బయో మైనింగ్ చేస్తున్న యంత్రాలు - శుద్ధి చేసిన బయో సాయిల్

మూడు దశాబ్దాల సమస్య పరిష్కారం

బయో మైనింగ్ ద్వారా వ్యర్థాల శుద్ధి ● కొణ్ణంబట్టులో డంపింగ్ యార్డుకు పది ఎకరాల కేటాయింపు

సూళ్లూరుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రజలను పట్టి పీడిస్తున్న సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. మూడు దశాబ్దాలుగా వెంటాడున్న సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. సూళ్లూరుపేట పట్టణంలో నడిబొడ్డున జాతీయ రహదారి పక్కనే హోలిక్రాస్ సమీపంలో కాళంగి నదిని ఆనుకొని డంపింగ్ యార్డు ఉంది. పట్టణంలో ఉత్పత్తి అయ్యే 21 మెట్రిక్ టన్నుల చెత్త, ఇతర వ్యర్థాలన్నింటినీ మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు డంపింగ్ యార్డుకు తరలిస్తారు. 1994 నుంచి ఉత్పత్తి అయిన చెత్తతో దాదాపు 38 వేల మెట్రిక్ టన్నులు వ్యర్థాలు పేరుకుపోయాయి. అప్పుడప్పులు చెత్తలో మంటలు వ్యాపించి పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. డంపింగ్ యార్డు నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజలు పలు రకాల వ్యాధుల బారినపడేవారు. కాళంగి నదీలోకి వ్యర్థాలు జారడంతో నదీ ప్రాంగణమంతా కాలుష్య కోరల్లో చిక్కుకొంది. ఈ సమస్యను పరిష్కరించాలని అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లోని డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను శుద్ధిచేసి ఎరువుల తయారు చేసేందుకు ఏజెన్సీలకు అప్పగించారు. దీంతో సూళ్లూరుపేటలో మూడు దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించింది. గుట్టలుగుట్టలుగా ఉన్న చెత్తను బయో మైనింగ్ ద్వారా బయో సాయిల్, భవన నిర్మాణ, మండే స్వభావం కలిగిన వ్యర్థాలను వేరు చేస్తున్నారు. ఇందులో ఆర్డీఎఫ్‌ను పవర్ జనరేషన్ కంపెనీలకు, బయో సాయిల్‌ను లోతట్టు పల్లపు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 29 వేల మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేశారు. సెప్టెంబరు నెలాఖరులోగా డంపింగ్ యార్డులో చెత్తను శుద్ధిచేసి అక్కడ ఆహ్లాదకర వాతావరణంలో పార్కు ఏర్పాటు చేసేందుకు మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పట్టణానికి దూరంగా డంపింగ్ యార్డు

పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో శ్రీకాళహస్తికి వెళ్లే రోడ్డు పక్కనే కొణ్ణంబట్టు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 131లో 10 ఎకరాల భూమిని డంపింగ్ యార్డుకు కేటాయించారు. ఈ భూమికి సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్‌ను రెవెన్యూ అధికారులు మున్సిపాలిటీకి అందజేశారు. ఇకపై పట్టణంలో ఉత్పత్తి అయ్యే చెత్తను కొణ్ణంబట్టు వద్ద కేటాయించిన స్థలంలో డంపింగ్ యార్డుకు తరలించనున్నారు.

మూఢనమ్మకాలను పారదోలడంలో జేవీవీ కీలకపాత్ర

గూడూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మూఢ నమ్మకాలను పారదోలి, సైన్స్‌పట్ల అవగాహన పెంచడంలో జనవిజ్ఞానవేదిక కీలకపాత్ర పోషిస్తోందని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేవీవీ దేశవ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, సామాజిక చైతన్యాన్ని తీసుకురావడంలో ప్రధాన భూమిక పోషిస్తోందన్నారు. సమాజంలోని మూఢనమ్మకాలను పారదోలేందుకు, విద్యార్థుల్లో సైన్స్‌పట్ల అవగాహన పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా గుర్తించి ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వేగూరు రాజేంద్రప్రసాద్, రామ్మోహన్‌రావు, శర్మ, ఇబ్రహీం, శ్రీనివాసాచారి, నాగరాజు, చెంచునారాయణ, సుమన్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

వేనాడు దర్గాలో జెండా స్థాపన
30న గంధోత్సవం



జెండా స్థాపనకు పూజసామగ్రి తీసుకెళ్తున్న నిర్వాహకులు

సూళ్లూరుపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వేనాడు దర్గాలో ఈనెల 30న గంధోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. గంధోత్సవానికి వారం రోజులు ముందు చేసే జెండా స్థాపన(నిషాన్) కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా ముస్లిం మతపెద్దలు దర్గాలో ప్రత్యేక పూజలు చేసి జెండాను ప్రదర్శనగా తీసుకెళ్లి స్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు సుదర్శన్ రావు, సర్పంచ్ అన్నపూర్ణ, మాజీ సర్పంచ్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యంలకు ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న వేనాడు గ్రామస్తులు

సూళ్లూరుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వేనాడు దర్గాలో ఈనెల 30న నిర్వహించే గంధమహోత్సవానికి రావాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యంకు నిర్వాహకులు ఆదివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుదర్శనరావు, శ్రీరాం మొదలి, వెంకటాద్రి మొదలి, భాస్కర్, మణి మొదలి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

31నుంచి టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలు



టీషర్ట్‌లను ఆవిష్కరిస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈనెల 31నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు ప్రగతిసేవా సంస్థ ఆధ్వర్యంలో టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో క్రికెట్ పోటీలకు సంబంధించి టీషర్ట్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కరిముల్లా, మురళీసింగ్, బాబర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వరాహస్వామి జయంతి

తిరుమల, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం వరాహస్వామి జయంతి జరుగనుంది. ఇందులో భాగంగా స్వామి ఆలయంలో ఉదయం కలశస్థాపన, కలశపూజ, పుణ్యాహవచనం చేస్తారు. తర్వాత పంచామృతంతో వేదోక్తంగా మూలవర్లకు ఏకాంతంగా అభిషేకం నిర్వహిస్తారు. ఆగమశాస్త్రం ప్రకారం టీటీడీ ఏటా వరాహస్వామి జయంతి నిర్వహిస్తోంది. స్థల పురాణం ప్రకారం తిరుమలలో తొలిపూజ, తొలి నివేదన వరాహస్వామికే చేస్తారు. భక్తులు వరాహస్వామిని దర్శించాక శ్రీవారి ఆలయంలో అడుగుపెట్టడం ఆనవాయితీ.

వెంకయ్య స్వామి ఆరాధనోత్సవం

వెంకటగిరి టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) వల్లివేడు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న భగవాన్ వెంకయ్య స్వామి ఆరాధనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

బాలాయపల్లి: మండలంలోని జయంపు గ్రామంలో వెలసిన భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో ఆరాధనోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం చేశారు.

అన్నదానం

గూడూరు అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ఆదివారం శ్రీకృష్ణసేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మహేశ్వరి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



పోలేరమ్మ ప్రతిమకు పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

వాకాడు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెం పంచాయతీ మేతగానివాడ ప్రాంత ప్రజల ఇలవేల్పు పోలేరమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు దివి అనంతాచార్యులు అమ్మవారి మూలమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గ్రామస్తులు 58 కలశాలతో విశేష అభిషేకాలు నిర్వహించి అమ్మవారికి హోమాలు జరిపించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లుపెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, పసుపు కుంకుమ పంపిణీ చేశారు.

కోటమ్మకు...



కోట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మకు...



చిల్లకూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా నివేదించారు. ప్రత్యేక అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట వున్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

2న అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుచానూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయంలో వచ్చే నెల 5నుంచి 7వ తేదీ వరకు వార్షిక పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఈ క్రమంలో 2వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆరోజు ఊంజల్‌సేవను రద్దు చేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల,ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 11 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

నేటి నుంచి స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

పెళ్లకూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు డిప్యూటీ తహసీల్దారు యువరాజ్ తెలిపారు. 13 గ్రామ సచివాలయ పరిధిలో 10250 స్మార్ట్ కార్డులను సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేస్తారని, ఈ ప్రక్రియ నాలుగు విడతల్లో జరుగుతుందన్నారు.

వాకాడు: మండలంలో సోమవారం నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనున్నామని డిప్యూటీ తహసీల్దారు రఫీ సయ్యద్ తెలిపారు. నాలుగు విడతల్లో 12,259 స్మార్ట్‌కార్డులను పంపిణీ చేస్తామన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత



స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులతో బయోస్టాండ్ ఇండియా ప్రతినిధులు

చిట్టమూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): 2024-2025 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బయో స్టాండ్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఆదివారం అరవపాళెం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 20మంది విద్యార్థులకు రూ.2500 చొప్పున అందజేశారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు బయో స్టాండ్ ఇండియా కంపెనీ సాయం అందించడం పట్ల హెచ్ఎం మంజుల కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఎం నర్సింహారెడ్డి, ఫీల్డు ఆఫీసర్ మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న దయాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు

నాయుడుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి రెండోసారి నియమితులైన సందర్భంగా ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. మొదట రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణ పురవీధుల్లో బైక్ ర్యాలీ చేపట్టారు. టీడీపీ నాయకులు పొట్లపూడి రాజేష్ శాలువా, పూలమాలతో దయాకర్‌రెడ్డిని సన్మానించారు. గ్రామదేవత పోలేరమ్మ గుడి వద్ద దయాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అమరావతి రామయ్య, చిగురాకుల సురేంద్ర, కాంట్రాతి సుందరరావు, నూరిబాబు, కోటేశ్వరరావు, బాను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ - తిరుపతి మధ్య 8 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా సికింద్రాబాద్ - తిరుపతి మధ్య 8 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. డోన్, కడప మార్గంలో రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. సికింద్రాబాదులో సెప్టెంబరు 4వ తేదీ నుంచి ప్రతి గురువారమూ ప్రత్యేక రైలు(07009) బయలుదేరి కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల్, కర్నూల్‌సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా తిరుపతికి మరుసటి రోజు చేరుకుంటుంది. తిరుపతిలో సెప్టెంబరు 5వ తేదీ బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు సికింద్రాబాదుకు చేరుకుంటుంది. ఇలా సెప్టెంబరు 26 తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. ఫస్ట్, సెకండ్, థర్డ్ ఏసీలతోపాటు సెకండ్ స్లీపర్, సాధారణ కోచ్‌లు ఉంటాయని పేర్కొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యానికి ప్రాధాన్యం



ట్రాఫిక్ మొబైల్ అంబ్రెల్లాలను ప్రారంభిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన రాజు పేర్కొన్నారు. పోలీసు పరేడ్ గ్రౌండులో ఆదివారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ మొబైల్ అంబ్రెల్లాలను ఆయన ప్రారంభించారు. నడిరోడ్లపై నిలబడి ఎండ, వాన, దుమ్ము, ధూళితో అనారోగ్యం పాలవుతున్న ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తనపల్లి, ఆర్సీపురం జంక్షన్, వార్త క్రాస్, మ్యాంగో మార్కెట్, గరుడ సర్కిల్ తదితర 20 ప్రాంతాల్లో ఈ మొబైల్ అంబ్రెల్లాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రామకృష్ణమాచారి, ప్రసాద్, సీఐలు సంజీవ్‌కుమార్, భాస్కర నాయక్, సుబ్బరామిరెడ్డి, ఎస్ఐలు విజయలక్ష్మి, బాలాజీ పాల్గొన్నారు.